1 St Year Happy Work Anniversary.

షణ్ముఖ
SHANMUKHAVELUGU
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు — తెలుగు దినపత్రిక

RNI : APTEL / 2023 / 89152

Good for Health
Best for Readers

సంపుటి : 03 సంచిక : 145
మంగళవారం 02 జూన్ 2026 పేజీలు 8 వెల : రూ.3

Printed by Ongole. Published From Ongle, Nellore, Guntur, Markapur, Bapatla.




## అమెరికా పౌరసత్వం మరింత ఖరీదు..

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, జూన్ 23)

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారం చేపట్టినప్పటి నుంచి ఇమిగ్రేషన్ రూల్స్‌ను కఠినతరం చేస్తూనే ఉన్నారు. తాజాగా ఆయన కార్యవర్గం చేసిన ప్రతిపాదనలతో అమెరికా పౌరసత్వం మరింత ఖరీదుగా మారనుంది. పౌరసత్వ దరఖాస్తుల ఫైలింగ్ ఫీజులను 75 శాతం మేర పెంచాలని యూఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌లాండ్ సెక్యూరిటీ ▶ మిగతా 2లో

## చైనాలో వింత దృశ్యం.. పవర్ చార్జింగ్ కోసం మోకాళ్లపై కూర్చుని రోబో భిక్షాటన!



- సిచువాన్ ప్రావిన్స్ వీధుల్లో హ్యూమనాయిడ్ రోబో భిక్షాటన
- డొనేషన్ ప్లేట్, క్యూఆర్ కోడ్‌తో వినూత్నంగా అభ్యర్థన

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, జూన్ 23)

సాంకేతిక రంగంలో ప్రపంచానికే సవాలు విసురుతున్న చైనాలో చోటు చేసుకున్న ఒక వింత దృశ్యం ప్రస్తుతం సోషల్ మీడియాలో సంచలనంగా మారింది. ▶ 2లో

## ఇరాన్ చమురుపై అమెరికా ఆంక్షల సడలింపు.. భారత్‌కు భారీ ఊరట!




- ఆగస్టు 21 వరకు 60 రోజుల పాటు చమురు అమ్మకాలకు అనుమతి
- ఈ నిర్ణయంతో ప్రపంచ మార్కెట్లో తగ్గిన ముడి చమురు ధరలు

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ, జూన్ 23)

అంతర్జాతీయ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇరాన్ చమురు పరిశ్రమకు ▶ మిగతా 2లో

## 80కి పైగా అజెండా అంశాలకు ఏపీ క్యాబినెట్ గ్రీన్‌సిగ్నల్

(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూన్ 23)



ఏపీ మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపారు. సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన భేటీలో 80కి పైగా అజెండా అంశాలకు క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. వివిధ ప్రాంతాల్లో పెట్టుబడుల స్థాపనకు పెద్దపీట వేస్తూ మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. పరిశ్రమలు, ఐటీ, పర్యాటకం, రాజధాని అభివృద్ధి, డేటా సెంటర్లు, పునరుత్పాదక ఇంధన రంగానికి సంబంధించిన ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. పెట్టుబడుల ప్రోత్సాహక మండలిలో తీసుకున్న దాదాపు రూ.34వేల కోట్ల పెట్టుబడుల స్థాపన ద్వారా 35వేల ఉద్యోగాల కల్పన సంబంధించిన నిర్ణయాలకు మంత్రివర్గం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఉండవల్లిలో రూ.426 కోట్లతో మౌలిక సదుపాయాల కల్పన, ఏపీ జ్యుడిషియల్ అకాడమీ నిర్మాణానికి రూ.139 కోట్ల వ్యయంతో పనులు చేపట్టడం తదితర నిర్ణయాలకు క్యాబినెట్ ఆమోదముద్ర వేసింది. అమరావతిలో ఫైవ్‌స్టార్ హోటళ్లు, కన్వెన్షన్ సెంటర్లకు ప్రోత్సాహకాలు ఇచ్చే ప్రతిపాదనలకు మంత్రివర్గం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. విశాఖ, తిరుపతి, కర్నూలు, అన్నవరం ప్రాంతాల్లోనూ పర్యాటక ప్రాజెక్టులకు క్యాబినెట్ అంగీకారం తెలిపింది. ప్రభుత్వ రంగ సంస్థలు, కార్పొరేషన్లు, సొసైటీల ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 60 నుంచి 62 సంవత్సరాలకు పెంచుతూ తీసుకున్న నిర్ణయానికి మంత్రివర్గం అంగీకారం తెలిపింది. అనంతపురం, కడప జిల్లాల్లో సౌర, పవన విద్యుత్ ప్రాజెక్టులకు భూముల కేటాయింపులు, బయోగ్యాస్ ప్లాంట్ల ఏర్పాటుకు ప్రోత్సాహకాలు ఇచ్చే ప్రతిపాదనలకు క్యాబినెట్ ఆమోదముద్ర వేసింది. అమరావతి ల్యాండ్ పూలింగ్ స్కీమ్ మొదటి, రెండో దశ కోసం సీఆర్డీఏ డిప్యూటీ కలెక్టర్లు, తహసీల్దార్లకు సంబంధించి 95 తాత్కాలిక పోస్టుల మంజూరుకు మంత్రివర్గం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది.




## పవన్ వల్ల కులాల మధ్య విభేదాలు పెరుగుతున్నాయి

- ▶ పవన్ వల్ల కులాల కుంపటి రాజుకుంటోందన్న నారాయణస్వామి
- ▶ ప్రజలను రక్షించాల్సిన పోలీసులు భక్షకులుగా మారారని ఆరోపణ
- ▶ సాయికృష్ణ మృతి కేసును సీబీఐకి అప్పగించాలని డిమాండ్



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూన్ 23)

రాష్ట్రంలో జనసేన అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వల్లే కులాల కుంపటి రాజుకుంటోందని వైసీపీ నేత, మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి ధ్వజమెత్తారు. పవన్ అనుసరిస్తున్న విధానాల వల్ల సమాజంలో కులాల మధ్య విభేదాలు పెరుగుతున్నాయని ఆరోపించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని, ప్రజలను కాపాడాల్సిన పోలీసులే భక్షకులుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.విజయవాడ కృష్ణలంకకు చెందిన సాయికృష్ణ మృతి కేసును ప్రస్తావిస్తూ.. ఈ దారుణం వెనుక ఉన్న అసలైన 'బిగ్ బాస్' ఎవరో తేలాలని నారాయణస్వామి డిమాండ్ చేశారు. "గతంలో రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు సొంత కుమారుడు జగన్ పై ▶ మిగతా 2లో



## మురళీమోహన్, రాజేంద్రప్రసాద్‌కు లోకేశ్ సత్కారం

(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూన్ 23)

పద్మశ్రీ పురస్కారాలకు ఎంపికైన ప్రముఖ నటులు మురళీమోహన్, రాజేంద్రప్రసాద్‌లను రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ సోమవారం దిల్లీలో సత్కరించారు. మంగళవారం జరగనున్న పురస్కారాల ప్రదానోత్సవం కోసం దిల్లీ వచ్చిన వారిని.. లోకేశ్ మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాలు కప్పి, జ్ఞాపికలు అందజేశారు. మురళీమోహన్, రాజేంద్రప్రసాద్ తమ నటనతో తెలుగు సినిమాకు వన్నె తెచ్చారని కొనియాడారు. కార్యక్రమంలో కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, పలువురు తెదేపా ఎంపీలు పాల్గొన్నారు.

## ఆహార భద్రత లోపాలపై చర్యలు తీసుకోండి

(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూన్ 23)

ఆహార భద్రతా వ్యవస్థలో లోపాలపై తక్షణ చర్యలు తీసుకోవాలని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలో కల్తీ పాలు, నకిలీ మసాలాలు, నాసిరకం ప్యాకేజ్డ్ ఫుడ్, కలుషిత తాగునీరు, అపరిశుభ్ర మాంసం అమ్మకాలపై జనతా వారధి కార్యక్రమానికి ఫిర్యాదులు, వినతులు వస్తుండడం ఆందోళన కలిగిస్తోందని సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 'ఆహార భద్రత అమలులో కీలకమైన ఫుడ్ సేఫ్టీ అధికారుల కొరత తీవ్రంగా ▶ మిగతా 2లో



## జనసేన ఎమ్మెల్యే పంతం నానాజీకి వైసీపీ నేత రాచమల్లు వార్నింగ్

ఇటీవల జగన్ పై విమర్శలు గుప్పించిన నానాజీ ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడాలంటూ రాచమల్లు వార్నింగ్ జగన్ దమ్ము ఏంటో పవన్ ను అడిగి తెలుసుకోవాలని వ్యాఖ్య



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూన్ 23)

వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ ను టార్గెట్ చేస్తూ కాకినాడ రూరల్ జనసేన ఎమ్మెల్యే పంతం నానాజీ చేసిన వ్యాఖ్యలపై ▶ మిగతా 2లో

## కులాల మధ్య చిచ్చుపెట్టడం జగన్ డీఎన్‌ఏలోనే ఉంది

(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూన్ 23)



కులాలు, మతాల మధ్య చిచ్చుపెట్టి రాజకీయ లబ్ధి పొందాలనుకోవడం వైకాపా అధినేత జగన్ డీఎన్‌ఏలోనే ఉందని మంత్రి అనగాని సత్యప్రసాద్ ధ్వజమెత్తారు. గత తెదేపా ప్రభుత్వ హయాంలో ఓ సామాజికవర్గానికి చెందిన వారికే డీఎస్పీ పదోన్నతులు వచ్చాయని తప్పుడు ప్రచారం చేసి, జగన్ లబ్ధి పొందారని గుర్తుచేశారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 'ప్రతి దానికీ కులం రంగు పులమడం గొడ్డలి పార్టీ నైజం. డాక్టర్ సుధాకర్, అమర్‌నాథ్‌గౌడ్, తోట చంద్రయ్యల్ని ▶ 2లో

## పర్యాటక రంగంపై గొడ్డలి పార్టీ విషం చిమ్ముతోంది



- ▶ రుషికొండను ధ్వంసం చేసి ప్యాలెస్ కట్టుకున్నారంటూ జగన్‌పై బాలాజీ తీవ్ర విమర్శలు
- ▶ గత పాలనలో రాష్ట్రాన్ని గంజాయి హబ్‌గా మార్చారని తీవ్ర ఆరోపణలు

(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూన్ 23)

ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీటీడీసీ) ఛైర్మన్, టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు నూకసాని బాలాజీ నేడు మీడియా సమావేశం నిర్వహించారు. ▶ మిగతా 2లో

## పులివెందుల చేరుకున్న జగన్.. హెలిప్యాడ్ వద్ద ఘన స్వాగతం!



- మూడు రోజుల పర్యటనకుగాను పులివెందుల చేరుకున్న జగన్
- హెలిప్యాడ్ నుంచి తన క్యాంప్ కార్యాలయానికి చేరుకున్న వైసీపీ అధినేత
- నేతలు, ప్రజలను నేరుగా కలవనున్న జగన్

(షణ్ముఖ వెలుగు, అమరావతి,జూన్ 23)

వైసీపీ అధినేత జగన్ తన సొంత నియోజకవర్గంలో మూడు రోజుల పర్యటనను ప్రారంభించారు. కాసేపటి క్రితం హెలికాప్టర్ లో ▶ మిగతా 2లో

## ఓటరు జాబితా సమగ్రత కార్యక్రమంలో నూరుల్లాఖాద్రి



**(షణ్ముఖ వెలుగు, కంభం, జూన్ 23)**

మార్కాపురం జిల్లా కంభం పట్టణంలోని అర్బన్ కాలనీలో గల 60, 61 బూత్‌ల పరిధిలో జరుగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంలో 10వ యూనిట్ బాధ్యులు సయ్యద్ నూరుల్లా ఖాద్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓటరు జాబితా సవరణ, కొత్త ఓటర్ల నమోదు, వివరాల మార్పులు, అర్హత లేని పేర్ల తొలగింపు ప్రక్రియను పరిశీలించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని, తమ ఓటరు వివరాలను పరిశీలించి అవసరమైన సవరణలు చేయించుకోవాలని ఆయన సూచించారు. ఎన్నికల సంఘం చేపడుతున్న ఈ ప్రత్యేక కార్యక్రమం ద్వారా ఓటరు జాబితా మరింత పారదర్శకంగా, ఖచ్చితంగా రూపొందించబడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బూత్ స్థాయి అధికారులు, సిబ్బంది మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి అర్హుడూ తన పేరును ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని సయ్యద్ నూరుల్లా ఖాద్రి పిలుపునిచ్చారు.

## 11వ తేదీ నిర్వహించే జాతీయ లోక్ అదాలత్



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 23)**

చిట్ ఫండ్ సంస్థలు జూలై 11వ తేదీ నిర్వహించే జాతీయ లోక్ అదాలత్ ఎక్కువ సంఖ్యలో కేసులు పరిష్కారానికి మంచి అవకాశమని, దీనిని సద్వినియోగపరచుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఏ సత్యానంద్ అన్నారు. మంగళవారం ఒంగోలు పట్టణంలోని జిల్లా న్యాయస్థానం ప్రాంగణంలో ప్రకాశం జిల్లా వ్యాప్తంగా ఉన్న చిట్ ఫండ్ అధినేతలు, అధికారులు, సంబంధిత న్యాయవాదులతో నిర్వహించిన కార్యక్రమంలో న్యాయమూర్తి మాట్లాడుతూ జాతీయలో లోక్ అదాలత్ కేసులు పరిష్కరించుకోవడం ద్వారా చిట్ ఫండ్, ఆర్థిక సంస్థల మీద మీద కూడా ఎంతో కేసుల భారం తగ్గుతుందని ఈ అవకాశాన్ని అవకాశమున్న సంస్థలు ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి టి రాజ్యలక్ష్మి, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఇంచార్జ్ కార్యదర్శి సిహెచ్ వి రామకృష్ణ, వివిధ చిట్‌ఫండ్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## స్వర్గీయ పూలసుబ్బయ్య పోరాట పటిమ, వ్యక్తిత్వం నాయకులకు ఆదర్శం

**మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు**





**(షణ్ముఖ వెలుగు, మార్కాపురం టౌన్, జూన్ 23)**

వెలుగొండ ప్రాజెక్ట్ సాధనకు ఉద్యమ ప్రదాత, మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ పూల సుబ్బయ్య జీవితం, పోరాటం, ఆయన వ్యక్తిత్వం నేటి తరం రాజకీయ నాయకులకు ఆదర్శంగా నిలుస్తుందని గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే, మార్కాపురం నియోజకవర్గ వైఎస్సాసీపీ ఇంచార్జి అన్నా రాంబాబు అన్నారు. స్వర్గీయ పూల సుబ్బయ్య 38వ వర్ధంతిని పురస్కరించుకుని కామ్రేడ్ పూల సుబ్బయ్య భవన్ శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ పూల సుబ్బయ్య సేవలను కొనియాడారు. సామాన్య రైతు కుటుంబంలో పుట్టి న్యాయ విద్య పూర్తి చేసి, తురిమెళ్ళ హైస్కూల్ ప్రధానోపాధ్యాయునిగా కొంతకాలం పనిచేసిన ఆయన తన భావజాలానికి అనుగుణంగా సిపిఐ పార్టీ ద్వారా శాసనసభ్యునిగా ఎన్నికై సామాన్యులకు, గిరిజనులకు, తాండా వాసులకు మరచిపోలేని సేవలందించారని గుర్తు చేశారు.

## మొదటిపేజీ తరువాయి

### అమెరికా పౌరసత్వం మరింత ఖరీదు..

ప్రతిపాదించింది. సక్రమ మార్గంలో వచ్చిన వలసదారులు పౌరసత్వానికి దరఖాస్తు చేసుకుంటే.. ప్రాసెసింగ్, వెట్టింగ్ ఖర్చులు భరించాల్సిరావడంతో పాటు ఇప్పటివరకు ఉన్న పలు మినహాయింపులను కూడా కోల్పోనున్నారు.పౌరసత్వ దరఖాస్తు (పేపర్ బేస్డ్) ఫైల్ చేయడానికి ఫీజు 760 డాలర్ల నుంచి 1330 డాలర్లకు పెరగనుంది. ఆన్‌లైన్ దరఖాస్తు విషయానికొస్తే.. 710 డాలర్ల నుంచి 1280 డాలర్లకు ఫీజు పెంపును అధికారులు ప్రతిపాదించారు. ఈ కొత్త ఫీజులు అమల్లోకి వస్తే.. 75 శాతం మేర భారం పడనుంది. ఏదైనా సిటిజన్‌షిప్ అప్లికేషన్ తిరస్కరణకు గురైతే.. దానిని తిరిగి పరిశీలించాలని కోరినా సరే.. ఖర్చుల మోత మోగనుంది. ఆ రుసుము 830 డాలర్ల నుంచి 1475 డాలర్లకు అంటే 645 డాలర్ల మేర పెరగనుంది. ప్రస్తుతం ఈ ప్రతిపాదిత నిబంధనలపై 60 రోజుల పాటు ప్రజాభిప్రాయ సేకరణ చేయనున్నారు. అలాగే అమెరికాలో ఆదాయ ఆధారిత మార్గదర్శకాల ప్రకారం.. దరఖాస్తుదారులకు ప్రస్తుతం లభిస్తోన్న మినహాయింపులను తొలగించాలని డీహెచ్‌ఎస్ ప్రతిపాదించింది. 400 శాతం లేక అంతకంటే తక్కువ ఆదాయం ఉన్న దరఖాస్తుదారులకు రెడ్యూస్డ్ ఫీజ్ ఆప్షన్‌ను తీసేయాలని సూచించింది. ఈ కొత్త రూల్స్ వల్ల సహజంగా పౌరసత్వం పొందడానికి అర్హత ఉన్న శాశ్వత నివాసితులు.. తమకున్న అవకాశాలు కోల్పోయే ప్రమాదం ఉందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

### చైనాలో వింత దృశ్యం.. పవర్ చార్జింగ్ కోసం మోకాళ్లపై కూర్చుని రోబో భిక్షాటన!

పవర్ ఛార్జింగ్ కోసం డబ్బులు లేవంటూ ఒక అత్యాధునిక హ్యూమనాయిడ్ రోబో నడిరోడ్డుపై మోకాళ్లపై కూర్చుని భిక్షాటన చేయడం అందరినీ విస్మయానికి గురిచేస్తోంది. దీనికి సంబంధించిన వీడియోలు ప్రస్తుతం ఇంటర్నెట్‌లో వైరల్ అవుతున్నాయి.చైనాలోని సిచువాన్ ప్రావిన్స్‌లో తొలుత వెలుగుచూసిన ఈ దృశ్యంలో 'యూనిట్రీ' అనే రోబోటిక్స్ సంస్థ రూపొందించిన 'జీ1' మోడల్ రోబో కనిపిస్తుంది. ఇది తన రెండు చేతులూ జోడించి అత్యంత దీనంగా మోకాళ్లపై కూర్చుని ఉండటం గమనార్హం. దాని ముందు ఒక డొనేషన్ ప్లేట్, డిజిటల్ చెల్లింపుల కోసం ఒక క్యూఆర్ కోడ్‌ను సైతం ఏర్పాటు చేశారు. "రీఛార్జ్ చేసుకోవడానికి డబ్బులు లేవు", "దయచేసి పవర్ రీఛార్జ్ బిల్లుల కోసం సహాయం చేయండి" అనే సందేశాలు అందులోని లౌడ్ స్పీకర్ ద్వారా నిరంతరం వినిపిస్తున్నాయి. అటుగా వెళుతున్న కొందరు బాటసారులు నాణేలు వేయడం, క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి డబ్బులు పంపించడం వంటి దృశ్యాలు ఆ వీడియోలో రికార్డయ్యాయి.కేవలం సిచువాన్‌లోనే కాకుండా చెంగ్డూ, బీజింగ్, గ్వాంగ్‌జౌ వంటి ప్రధాన నగరాల్లోనూ ఇలాంటి వింత ఘటనలు వెలుగుచూశాయి. సుమారు 16,000 డాలర్ల (దాదాపు రూ. 13 లక్షలు) విలువ చేసే ఈ అత్యాధునిక రోబోలు ఇలా రోడ్డు పక్కన భిక్షాటన చేయడం చర్చనీయాంశంగా మారింది. వాస్తవానికి అత్యంత క్లిష్టమైన పనులను సైతం అలవోకగా చేయగలిగే సామర్థ్యం ఈ రోబోలకు ఉంది. కొద్ది నెలల క్రితమే ఈ మోడల్‌కు చెందిన ఒక రోబో ఈక్వెడార్‌లోని ఒక అగ్నిపర్వతాన్ని కూడా అధిరోహించింది.ఈ వీడియోలపై నెటిజన్లు రకరకాలుగా స్పందిస్తున్నారు. 'ఇక బిచ్చగాళ్ల స్థానాన్ని కూడా రోబోలే భర్తీ చేస్తాయా?' అంటూ కొందరు వ్యంగ్యంగా కామెంట్ చేస్తున్నారు. ఇది కేవలం ఒక మార్కెటింగ్ గిమ్మిక్కా లేక సరికొత్త కళాత్మక ప్రదర్శనా, లేదంటే డబ్బు సంపాదించడానికి ఎంచుకున్న వినూత్న మార్గమా? అని పలువురు అభిప్రాయపడుతున్నారు.

### కులాల మధ్య చిచ్చుపెట్టడం జగన్ డీఎన్‌ఏలోనే ఉంది

చంపించినప్పుడు వీరికి కులం గుర్తుకురాలేదు. వైకాపా ప్రభుత్వంలో శాంతిభద్రతలు పూర్తిగా గాడితప్పాయి. మాదక ద్రవ్యాల వినియోగం విచ్చలవిడిగా మారింది. కూటమి ప్రభుత్వం వచ్చాక శాంతిభద్రతల్ని గాడిలో పెట్టాం' అని వెల్లడించారు.

### ఇరాన్ చమురుపై అమెరికా ఆంక్షల సడలింపు.. భారత్‌కు భారీ ఊరట!

ఊహించని ఊరటనిస్తూ అమెరికా సంచలన నిర్ణయం తీసుకుంది. ఇరాన్‌పై విధించిన కఠినమైన ఆంక్షలను తాత్కాలికంగా సడలిస్తూ 60 రోజుల మినహాయింపు ప్రకటించింది. ఆగస్టు 21 వరకు అమల్లో ఉండే ఈ నిర్ణయం ప్రకారం ఇరాన్ నుంచి ముడి చమురు, పెట్రోలియం ఉత్పత్తుల ఉత్పత్తి, అమ్మకం, రవాణా, దిగుమతులకు అనుమతి లభించింది. టెహరాన్‌తో విస్తృత శాంతి ఒప్పందం, అంతర్జాతీయ అణు తనిఖీలను తిరిగి ప్రారంభించే లక్ష్యంతో జరుగుతున్న చర్చల్లో భాగంగా అమెరికా ఈ నిర్ణయం తీసుకుంది. ఇది ఇరు దేశాల మధ్య నమ్మకాన్ని పెంచే చర్యగా భావిస్తున్నారు.

**భారత్‌కు ఈ పరిణామం ఎందుకు కీలకం?**

ప్రపంచంలోనే అతిపెద్ద ముడి చమురు దిగుమతిదారుల్లో ఒకటైన భారత్‌కు ఈ పరిణామం వ్యూహాత్మకంగా ఎంతో మేలు చేయనుంది. తన మొత్తం చమురు అవసరాల్లో దాదాపు 85 శాతం దిగుమతులపైనే ఆధారపడే భారత్, అంతర్జాతీయ ధరల ఒడిదొడుకులకు తీవ్రంగా ప్రభావితమవుతుంది. ముడి చమురు ధరల్లో ఏ చిన్న పెరుగుదలైనా దేశ దిగుమతి బిల్లు, ద్రవ్యోల్బణం, ఇంధన ధరలపై పెను ప్రభావాన్ని చూపుతుంది.

గత నాలుగేళ్లలో భారత్ చమురు దిగుమతుల సరళిలో భారీ మార్పులు వచ్చాయి. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం తర్వాత భారత్ రాయితీపై లభించే రష్యన్ ముడి చమురుకు అతిపెద్ద కొనుగోలుదారుగా అవతరించింది. ప్రస్తుతం మన దేశ మొత్తం దిగుమతుల్లో రష్యా వాటా దాదాపు 30-40 శాతంగా ఉంది. అదే సమయంలో సౌదీ అరేబియా, ఇరాక్, యూఏఈ వంటి గల్ఫ్ దేశాలపై కూడా భారత్ అధికంగా ఆధారపడి ఉంది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరిగిన ప్రతిసారీ, ఈ ఏకపక్ష ధోరణి వల్ల సరఫరాకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. ఇప్పుడు ఇరాన్ తిరిగి మార్కెట్లోకి వస్తే, భారత్‌కు మరో కీలకమైన, నమ్మకమైన చమురు వనరు అందుబాటులోకి వస్తుంది.

**భారత్-ఇరాన్ చమురు బంధం**

2018లో అమెరికా ఆంక్షలను తిరిగి విధించక ముందు, ఇరాన్ భారత్‌కు అతిపెద్ద చమురు సరఫరాదారులలో ఒకటిగా ఉండేది. పోటీ ధర, అనుకూలమైన రుణ నిబంధనలు, తక్కువ రవాణా ఖర్చులు వంటి కారణాలతో భారత రిఫైనరీలు ఇరాన్ చమురుకు ప్రాధాన్యత ఇచ్చేవి. కానీ ఆంక్షల వల్ల ఇరాన్ నుంచి దిగుమతులు పూర్తిగా నిలిచిపోయాయి. ఇప్పుడు లభించిన ఈ తాత్కాలిక అవకాశంతో భారత రిఫైనరీలు, ఇరాన్ సరఫరాదారుల మధ్య మళ్లీ చర్చలు మొదలయ్యే సూచనలు కనిపిస్తున్నాయి.

**తక్షణ ప్రయోజనాలు ఉంటాయా?**

ప్రస్తుత మినహాయింపు కేవలం 60 రోజులు మాత్రమే కావడంతో, భారత రిఫైనరీలు తక్షణమే భారీ కొనుగోళ్లకు సిద్ధపడకపోవచ్చు. దీర్ఘకాలిక స్పష్టత లభిస్తేనే వారు ఒప్పందాలు చేసుకుంటారు. అయితే, చర్చలు సఫలమైతే ఇరాన్ చమురు క్రమంగా మార్కెట్లోకి వస్తుందనే సంకేతాలు వెలువడ్డాయి. దీనివల్ల ప్రపంచ మార్కెట్లో చమురు సరఫరా పెరిగి ధరలు నియంత్రణలోకి వస్తాయి. భారత్ నేరుగా ఇరాన్ నుంచి కొనుగోలు చేయకపోయినా, ప్రపంచవ్యాప్తంగా ధరలు తగ్గితే అది మన దేశానికి పరోక్షంగా లాభమే.మరోవైపు హర్మూజ్ జలసంధి అంశం కూడా భారత్‌కు చాలా ముఖ్యం. మన దేశానికి వచ్చే చమురులో అత్యధిక భాగం ఈ జలసంధి ద్వారానే ప్రయాణిస్తుంది. అమెరికా-ఇరాన్ ఒప్పందంలో ఈ మార్గంలో నౌకల స్వేచ్ఛా రవాణాకు భరోసా లభించడం భారత్‌కు ఎంతో సానుకూల అంశం. ఇది కార్యరూపం దాల్చితే ఇరాన్ నుంచి చమురు దిగుమతులు పెరిగి, మన ఆర్థిక వ్యవస్థకు మేలు జరగడమే కాకుండా, ఇంధన ధరలు దిగివచ్చే అవకాశాలు కూడా మెరుగుపడతాయి.

### పవన్ వల్ల కులాల మధ్య విభేదాలు పెరుగుతున్నాయి

సీబీఐ విచారణకు వెనుకాడలేదు. అదే స్ఫూర్తితో ప్రస్తుత కూటమి ప్రభుత్వం కూడా ఈ దళిత యువకుడి కేసును నిష్పక్షపాతంగా సీబీఐకి అప్పగించాలి. అప్పుడే బాధ్యులైన ఎంతటి పెద్దవారికైనా శిక్ష పడుతుంది" అని స్పష్టం చేశారు. గతంలో తమిళనాడులో జరిగిన ఒక లాకప్ డెత్ ఘటనలో తొమ్మిది మంది పోలీసులకు ఉరిశిక్ష పడిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు.రాష్ట్రంలో ఒక దళిత మహిళ (వంగలపూడి అనిత) హోం మంత్రిగా ఉన్నప్పటికీ, దళిత సామాజికవర్గాలపై దాడులు జరుగుతున్నాయని అన్నారు. కూటమి నేతలు తక్షణమే దళితులపై దాడులను అరికట్టాలని, లేనిపక్షంలో వైసీపీ ఆధ్వర్యంలో బాధితుల తరపున పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

### పర్యాటక రంగంపై గొడ్డలి పార్టీ విషం చిమ్ముతోంది

ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనికతతో పర్యాటక రంగం అభివృద్ధి పథంలో దూసుకుపోతుంటే, ఓర్వలేక గొడ్డలి పార్టీ తప్పుడు ప్రచారానికి తెరలేపిందని ఆయన మండిపడ్డారు. గత గొడ్డలి పార్టీ పాలనలో పర్యాటక రంగం సర్వనాశనమైందని బాలాజీ ధ్వజమెత్తారు. "ప్రజావేదిక కూల్చివేతతోనే తన విధ్వంసకర పాలన ఎలా ఉంటుందో జగన్ చెప్పకనే చెప్పారు. రోజుకు రూ.2 లక్షల ఆదాయం తెచ్చే రుషికొండ పర్యాటక కేంద్రాన్ని ధ్వంసం చేసి, తన విలాసాల కోసం రూ.500 కోట్లతో ప్యాలెస్ నిర్మించుకున్నారు. రెండేళ్లయినా ఆ భవనాలను వినియోగించుకోలేని దుస్థితి. రూ.28 వేల కోట్ల పెట్టుబడులు తెస్తానని చెప్పి, ఒక్క ఉద్యోగం కూడా సృష్టించలేదు. టూరిజం కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేసి, ఆస్తులను సొంత అనుచరులకు కట్టబెట్టారు. రాష్ట్రాన్ని గంజాయికి హబ్‌గా మార్చి, యువతను నేరాల వైపు మళ్లించారు" అని బాలాజీ తీవ్ర ఆరోపణలు చేశారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 24 నెలల్లోనే పర్యాటక రంగంలో రూ.19,400 కోట్ల పెట్టుబడులు ఆకర్షించామని తెలిపారు. విశాఖలో జరిగిన సీఐఐ సమ్మిట్ ద్వారా వచ్చిన ఈ పెట్టుబడులతో 91,960 మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. ఇప్పటికే 18 ప్రాజెక్టులకు సంబంధించి రూ.4,376 కోట్ల పనులు ప్రారంభమయ్యాయని వెల్లడించారు. పర్యాటకుల ఆకాంక్షలకు అనుగుణంగా గోవా తరహాలో విశాఖ, సూర్యలంకలో బీచ్ షాక్స్ పాలసీ తీసుకొస్తే, దానిపైనా విష ప్రచారం చేస్తున్నారని విమర్శించారు.

రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని ప్రోత్సహించేందుకు నూతన పర్యాటక విధానం 2024-29 అమలు చేస్తున్నామని, 21 రోజుల్లోనే అనుమతులు మంజూరు చేస్తున్నామని బాలాజీ వివరించారు. కేంద్రం సహకారంతో రూ.441 కోట్లతో టెంపుల్, బీచ్ టూరిజం అభివృద్ధి చేస్తున్నామన్నారు. అమరావతిలో 'అవకాయ ఫెస్టివల్' వంటివి నిర్వహిస్తూ ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం అందిస్తున్నామని తెలిపారు. అరకు కాఫీ స్టాళ్లు, 14 చోట్ల ఎక్స్‌పీరియన్స్ సెంటర్లు, టెంట్ సిటీస్, కొత్తగా 10 రోప్‌వేల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేశామని, 20 బీచ్‌లకు బ్లూ ఫ్లాగ్ గుర్తింపు సాధించడమే లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ప్రజలిచ్చిన తీర్పునకు అనుగుణంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఏపీని దేశంలోనే అగ్రగామి పర్యాటక రాష్ట్రంగా తీర్చిదిద్దుతున్నారని బాలాజీ పేర్కొన్నారు.

### ఆహార భద్రత లోపాలపై చర్యలు తీసుకోండి

ఉండడంతో పర్యవేక్షణ కొరవడుతోంది. ఖాళీలు భర్తీ చేసి, జిల్లాకో మినీ ఫుడ్ టెస్టింగ్ ల్యాబొరేటరీ ఏర్పాటు చేయాలి. ఆహార సంస్థలకు లైసెన్సులు తప్పనిసరి చేయాలి. హోటళ్లు, రెస్టారెంట్లు, మాంసం దుకాణాల్లో పరిశుభ్రతపై తనిఖీలు నిర్వహించాలి. అక్రమ వధశాలలను మూసివేయాలి. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, హాస్టళ్లు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రత్యేక ఆహార భద్రత తనిఖీలు చేపట్టాలి. ప్రజల ఫిర్యాదుల స్వీకరణకు 24ఐ7 ఫుడ్ సేఫ్టీ హెల్ప్‌లైన్ ఏర్పాటు చేయాలి' అని ప్రభుత్వాన్ని మాధవ్ కోరారు.

### పులివెందుల చేరుకున్న జగన్.. హెలిప్యాడ్ వద్ద ఘన స్వాగతం!

జగన్ పులివెందులకు చేరుకున్నారు. కడప ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డి, ఎమ్మెల్సీలు రమేశ్ యాదవ్, పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి, బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధ, మాజీ మంత్రి అంజాద్ బాషా, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు తదితరులు జగన్ కు స్వాగతం పలికారు. హెలిప్యాడ్ వద్ద గుమిగూడిన జనాలను ఉద్దేశించి జగన్ తన స్టైల్లో చేతులెత్తి అభివాదం చేస్తూ ముందుకు సాగారు.హెలిప్యాడ్ నుంచి జగన్ నేరుగా పులివెందులలోని తన క్యాంప్ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ మూడు రోజుల పర్యటనలో భాగంగా ఆయన నియోజకవర్గ పరిధిలోని స్థానిక నేతలు, క్షేత్రస్థాయి కార్యకర్తలు, సాధారణ ప్రజలతో ముఖాముఖి భేటీలు కానున్నారు. క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతంపై ఈ పర్యటనలో జగన్ కీలక దిశానిర్దేశం చేయనున్నట్లు పార్టీ వర్గాల సమాచారం.

### జనసేన ఎమ్మెల్యే పంతం నానాజీకి వైసీపీ నేత రాచమల్లు వార్నింగ్

వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పంతం నానాజీ ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడాలంటూ హెచ్చరించారు.

అధికారంలో ఉన్నామనే అహంకారంతో కూటమి నాయకులు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని రాచమల్లు మండిపడ్డారు. "జగన్ దమ్ము, ధైర్యం ఏంటో పంతం నానాజీకి తెలియాలంటే ముందు ఢిల్లీలోని పెద్ద పెద్ద లీడర్లను అడగాలి. ఒంటరిగా పోరాడి, కేంద్రంలో ఉన్న పెద్ద పెద్ద వ్యవస్థలను సైతం ధైర్యంగా ఎదుర్కొన్న చరిత్ర జగన్ ది. అక్కడ కూడా తెలియకపోతే.. స్వయంగా మీ పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను అడిగితే జగన్ దమ్ము ఏంటో చాలా స్పష్టంగా చెబుతారు" అంటూ ఎద్దేవా చేశారు.కేవలం అధికార బలం చూసుకుని నోటికి వచ్చినట్లు మాట్లాడటం సరికాదని కూటమి నాయకులకు హితవు పలికారు. రాజకీయంలో విమర్శలు చేసేటప్పుడు కనీస స్థాయి మరిచి మాట్లాడే చౌకబారు సంస్కృతిని మానుకోవాలని స్పష్టం చేశారు. తాము ఇప్పుడు ఎన్నికల్లో ఓడిపోయి ప్రతిపక్షంలో ఉన్నంత మాత్రాన ఎవరికీ భయపడే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు.వైసీపీ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని, అప్పుడు తాము కేవలం ఇలా ప్రెస్ మీట్లు పెట్టి మాటలతో సరిపెట్టబోమని.. ఇప్పుడు అక్రమాలకు, వేధింపులకు పాల్పడుతున్న వారిపై లీగల్ యాక్షన్లు ఉంటాయని తీవ్రస్థాయిలో హెచ్చరించారు.

## ఇరువురు పార్టీ నేతలకు నివాళులర్పించిన ఎమ్మెల్యే బి ఎన్ విజయ్ కుమార్


**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 23)**

మద్దిపాడు మండలం నరసాయపాలెం గ్రామంలో అనారోగ్యంతో మరణించిన మేరంపూడి అదేమ్మ భౌతికకాయానికి, ఏడు గుండ్లపాడు మాజీ సర్పంచ్ సీనియర్ టిడిపి నాయకులు మండవ హరిప్రసాద్ (పెద్దకొత్తపల్లి సొసైటీ చైర్మన్) భౌతికకాయాలకు ఎమ్మెల్యే బి ఎన్ విజయ్‌కుమార్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు ఉప్పుగుండూరి నాగేశ్వరరావు, పోతినేని శ్రీనివాసరావు, మార్నేని రాఘవ, మందపల్లి శ్రీనివాసరావు, ముప్పా రవి, మండల నాయకులు, తదితరులు నివాళ్ళుర్పించారు.








ప్రకాశం

మార్కాపురం

బాపట్ల

షణ్ముఖ
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
23.06.26 బుధవారం


# మార్కాపురం జిల్లా కలెక్టరేట్, ఇతర భవన సముదాయాలకు 20 ఎకరాలు కేటాయిస్తూ రాష్ట్ర క్యాబినెట్ తీర్మానం

### ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ధన్యవాదాలు తెలిపిన ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి



**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, జూన్ 23)**

మార్కాపురం జిల్లా అభివృద్ధిలో కీలక అడుగు పడింది. మంగళవారం అమరావతిలోని సచివాలయంలో జరిగిన రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో మార్కాపురం జిల్లా కలెక్టరేట్, ఇతర భవన సముదాయాల కోసం అత్యంత కీలకమైన 20 ఎకరాల భూమిని మార్కాపురం మండలంలోని గోగులదిన్నె ఇలాకాలో ఇప్పుడు ఏర్పాటు చేసిన తాత్కాలిక కలెక్టరేట్ భవన సముదాయం ఎదుట కేటాయించారు. మార్కాపురం జిల్లా సాధనలో ముందుండి నడిపించిన మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఈ కీలకమైన కలెక్టరేట్, ఇతర బిల్డింగ్స్ నిర్మాణం కొరకు భూమి కేటాయింపు కొరకు నారా చంద్రబాబునాయుడు, క్యాబినెట్ మంత్రులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. మంగళవారం జరిగిన క్యాబినెట్‌లో కలెక్టరేట్, ఇతర ఉన్నతాధికారుల శాఖల భవనాల కోసం 20 ఎకరాల భూమిని కేటాయిస్తూ రాష్ట్ర క్యాబినెట్ తీర్మానం చేసింది. ఈ సందర్భంగా మార్కాపురం జిల్లాలోని ప్రజలందరూ తమ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మార్కాపురం జిల్లా సాధించడంతో పాటు అత్యంత కీలకమైన పరిపాలన సౌలభ్యం కోసం భవిష్యత్తు మార్కాపురం జిల్లా అభివృద్ధికి కీలకమైన గుండెకాయ వంటి కలెక్టరేట్, ఇతర భవనాల కోసం 20 ఎకరాలు కేటాయించడం శుభపరిణామమన్నారు. మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ప్రత్యేక కృషితో ఇది సాధ్యమైందన్నారు.

**కేటాయించిన భూముల వివరాలు**

మార్కాపురం మండలం గోగులదిన్నె ఇలాకాలో సర్వే నెం. 90 లో 1.95 ఎకరాలు, సర్వే నెం. 91 లో 0.77 సెంట్లు, సర్వే నెం. 92 లో 0.60 సెంట్లు, సర్వే నెం. 98-2 లో 0.61 సెంట్లు, సర్వే నెం. 99-2 లో 0.22 సెంట్లు, సర్వే నెం. 99-5 లో 0.24 సెంట్లు, సర్వే నెం. 100 లో 8.74 ఎకరాలు, సర్వే నెం. 101 లో 6.88 ఎకరాలు వెరసి మొత్తంగా 20.01 ఎకరాలు కేటాయించారు.



# పూల సుబ్బయ్య భవన నిర్మాణానికి రూ.1 లక్ష విరాళం

### ఉపాధ్యక్షులు కే ఎర్రయ్య ప్రకటన

**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, జూన్ 23)**

మార్కాపురంలో నిర్మాణంలో ఉన్న సిపిఐ కార్యాలయం, పూల సుబ్బయ్య భవన్ నిర్మాణానికి రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టియు) రాష్ట్ర ఉపాధ్యక్షులు కే ఎర్రయ్య తన తండ్రి కాగుటూరి సత్యానందం జ్ఞాపకార్థం రూ.1 లక్ష విరాళాన్ని ప్రకటించారు. ఈ మొత్తాన్ని సిపిఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ చేతుల మీదుగా భవన నిర్మాణానికి నగదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూల సుబ్బయ్య ఆశయాలు, సిద్ధాంతాలు తమ కుటుంబంపై విశేష ప్రభావం



4






# సీఎం పర్యటనకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయండి

### అధికారులకు జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత ఆదేశం

**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, జూన్ 23)**

గిద్దలూరు మండలం కృష్ణంశెట్టిపల్లి లో ఈ నెల 27వ తేదీన జరగనున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన ఏర్పాట్లను కట్టదిట్టంగా చేయాలని జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత అధికారులను ఆదేశించారు. సీఎం పర్యటన ఏర్పాట్ల పై మార్కాపురం కలెక్టరేట్‌లో మంగళవారం జిల్లా అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులందరూ సమన్వయంతో పని చేసి కార్యక్రమాన్ని విజయవంతం అయ్యేందుకు కృషి చేయాలన్నారు. ఎవరెవరికి ఏ ఏ పనులు అప్పగించామో వాటన్నింటినీ ఆ సమయంలోపు పూర్తిచేసుకుని సిద్ధంగా ఉండాలన్నారు. త్రాగునీరు, పారిశుద్ధ్యం, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. సభా ప్రాంగణం పక్కనే రైల్వే ట్రాక్ ఉన్నందున దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పోలీస్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అదే విధంగా మెప్మా, అగ్రికల్చర్ ఐసిడిఎస్, డీఆర్‌డీఏ, తదితర శాఖల వారు ప్రత్యేక స్టాల్స్‌ను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అందరు అధికారుల సహకారంతో ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేసుకోవాల్సిన బాధ్యత మనందరి పై ఉందని కలెక్టర్ వివరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు, మార్కాపురం, కనిగిరి ఆర్డీవోలు ఎం వెంకట శివరామిరెడ్డి, అజయ్ కుమార్, వ్యవసాయశాఖ జిల్లా ఇన్‌ఛార్జి అధికారి బాలాజీ నాయక్, జిల్లా రవాణాశాఖ అధికారి రాంబాబు, ఉద్యాన శాఖ అధికారి రమేష్, డిఎస్ఓ అంకయ్య, డీఎస్పీ నాగరాజు, ఐసిడిఎస్ ఇంచార్జి పీ డి పద్మావతి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఫిషింగ్ హార్బర్ నిర్మాణంతో తీర ప్రాంత ముఖచిత్రమే మారిపోతుంది

### ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులురెడ్డి



**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జూన్ 23)**

ఫిషింగ్ హార్బర్ నిర్మాణం ద్వారా అభివృద్ధి పరంగా కొత్తపట్నంతో పాటు మొత్తం తీర ప్రాంత ముఖచిత్రమే మారిపోతుందని ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులురెడ్డి అన్నారు. జిల్లా కలెక్టర్ పి రాజాబాబు, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావుతో కలిసి మంగళవారం ఆయన పల్లెపాలెంలో హార్బర్ నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ మాగుంట మాట్లాడుతూ రాష్ట్రానికి మొత్తం నాలుగు హార్బర్లు మంజూరు కాగా, వాటిలో ఒకటి కొత్తపట్నం మండలానికి రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిందన్నారు. అయితే నిర్మాణ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటా పై అస్పష్టత వలన పనులు ప్రారంభించడం కొంత జాప్యం జరిగిందన్నారు. హార్బర్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నందున నిర్మాణ వ్యయంలో అధిక వాటా భరిస్తున్నట్లు చెప్పారు. రూ.441 కోట్లలో కేంద్రం వాటా రూ.150 కోట్లు ఉందన్నారు. త్వరగా హార్బర్ నిర్మాణ పనులు ప్రారంభమయ్యేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. దీని శంకుస్థాపన కార్యక్రమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును తీసుకురావడానికి ప్రయత్నిస్తామని తెలిపారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు మాట్లాడుతూ హార్బర్‌తో పాటు ఈ ప్రాంతాన్ని పర్యాటకంగానూ అభివృద్ధి చేస్తామన్నారు. త్వరలోనే ఎయిర్ పోర్టు కూడా వస్తుందన్నారు. వాటికి అనుగుణంగా హోటళ్లు, రిసార్టులు కూడా ఈ ప్రాంతానికి తరలివస్తాయన్నారు. మొత్తంగా చూస్తే తీర ప్రాంతం ఆధారంగా అభివృద్ధి మరింత పుంజుకోనున్నదని ఎమ్మెల్యే చెప్పారు. జిల్లా కలెక్టర్ పి రాజాబాబు మాట్లాడుతూ జిల్లాలోని తీర ప్రాంతాన్ని ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా పల్లెపాలెం నుంచి మడనూరు వరకు సముద్ర తీరంలో (తరువాయి 4లో...)

# ప్రాధాన్యత రంగాలకు రుణాలు లక్ష్యాల మేరకు అందించాలి



కౌలు రైతులకు పంట రుణాలను అందించడంలో ప్రాధాన్యత ఇవ్వాలి

ఎంఎస్ఎంఈలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసేలా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలి

పిఎం సూర్య ఘర్ యోజన మూప్తి, బిజిలి యోజన రుణాలు వేగవంతం చేయాలి

డ్వాక్రా సంఘాలకు, యువతకు స్వయం ఉపాధి

రుణాల మంజూరుతో పాటు యూనిట్ల ఏర్పాటు పై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలి

జిల్లా బ్యాంకర్ల సమావేశంలో బ్యాంకర్లకు జిల్లా కలెక్టర్ పి రాజాబాబు ఆదేశం

**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జూన్ 23)**

జిల్లాలో వార్షిక రుణ ప్రణాళిక అమలులో ప్రాధాన్యత రంగాలకు నిర్దేశించిన లక్ష్యాల మేర రుణాలు మంజూరు చేయాలనీ జిల్లా కలెక్టర్ పి రాజాబాబు బ్యాంకర్లను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లోని సమావేశ హాలులో జిల్లా కలెక్టర్ పి రాజాబాబు అధ్యక్షతన డిస్ట్రిక్ట్ కన్సల్టెటివ్ కమిటీ, డిస్ట్రిక్ట్ లెవెల్ రివ్యూ కమిటీ బ్యాంకర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో 2025- 26 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలోని అన్ని బ్యాంకులకు నిర్దేశించిన పలురకాల రుణ లక్ష్యాలు, సాధించిన ప్రగతిని ఆయా బ్యాంకుల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అధికారులు, బ్యాంకు అధికారులు సమన్వయంతో పనిచేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలకు సంబంధించి కేటాయించిన రుణాల లక్ష్యాలను బ్యాంకర్లు పూర్తిగా ఖచ్చితంగా సాధించాలన్నారు. ప్రతి కుటుంబం నుంచి ఒక పారిశ్రామికవేత్త ఉండాలనే లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పని చేస్తున్నారని, అందుకనుగుణంగా యూనిట్స్ స్థాపన పై బ్యాంకర్లు, అధికారులు సమన్వయంతో యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. రామాయపట్నం పోర్టు నిర్మాణంతో రానున్న రోజుల్లో ప్రకాశం జిల్లా మరింతగా పారిశ్రామికంగా అభివృద్ధి చెందే అవకాశం వున్న నేపథ్యంలో ఈ నెల 22న ఒంగోలు నగరంలో ప్రకాశం బిజినెస్ అలైట్ మీట్ నిర్వహించి హాజరైన పారిశ్రామిక వేత్తలకు జిల్లాలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను సమగ్రంగా వివరించడం జరిగిందన్నారు. ఇందులో (తరువాయి 4లో...)





## పూల సుబ్బయ్య భవన నిర్మాణానికి రూ.1 లక్ష విరాళం

చూపాయని తెలిపారు. తన తండ్రి జీవితాంతం ప్రజాసేవలో కొనసాగుతూ సిపిఐతో అనుబంధంగా పనిచేశారని గుర్తు చేశారు. భవన నిర్మాణానికి ఉపాధ్యాయుల నుండి విరాళాలు సేకరించి రూ.30 లక్షల వరకు సహాయం అందించే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని వెల్లడించారు. పూల సుబ్బయ్య శాంతి భవన్‌ను విజ్ఞాన కేంద్రంగా అభివృద్ధి చేయాలని, ప్రతి సంవత్సరం వర్ధంతి సందర్భంగా విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించాలని సూచించారు.

# ప్రాధాన్యత రంగాలకు రుణాలు లక్ష్యాల మేరకు అందించాలి

భాగంగా బ్యాంకర్లు కూడా తమ వంతు సహకారం అందించాలన్నారు. జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడేలా బ్యాంకర్లు, అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. అలాగే జిల్లాలో ఉపాధి కల్పన యూనిట్స్ ఏర్పాటును ప్రోత్సహిస్తూ నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడేలా పిఎంఈజిపి, ముద్ర, పీఎం విశ్వకర్మ, తదితర కేంద్ర, రాష్ట్ర పథకాలకు సంబంధించిన రుణాల లక్ష్యాలను తప్పనిసరిగా పూర్తి చేయాలన్నారు. కౌలు రైతులకు పంట రుణాలను అందించడంలో ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. ముఖ్యంగా పియం సూర్య ఘర్ పథకంపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టి నిర్దేశించిన లక్ష్యాలను సాధించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, విద్యుత్ శాఖ అధికారులను, బ్యాంకర్లను ఆదేశించారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయ, అనుబంధ రంగాలకు 16 వేల 381 కోట్ల రూపాయలు లక్ష్యం కాగా, 18,499.56 కోట్ల రూపాయలు రుణాలుగా అందజేసి 112.93 శాతం లక్ష్యాన్ని సాధించడం జరిగిందన్నారు. అలాగే జిల్లాలోని 9 వేల 809 స్వయం సహాయక సంఘాలకు 1261.97 కోట్ల రూపాయలు రుణాలు లక్ష్యంగా కాగా 11,220 స్వయం సహాయక సంఘాలకు 1461.99 కోట్ల రూపాయలు రుణాలు మంజూరు చేసి 115.85 శాతం మేర లక్ష్యాన్ని సాధించడం జరిగిందన్నారు. అలాగే ఎంఎస్ఎంఈ సెక్టార్లో 4060.07 కోట్ల రూపాయలు రుణాలు లక్ష్యంగా కాగా, 3685.95 కోట్ల రూపాయలు రుణాలు మంజూరు చేసి 90.79 శాతం మేర లక్ష్యాన్ని సాధించడం జరిగిందన్నారు. డ్వాక్రా సంఘాలకు, యువత స్వయం ఉపాధి పథకాలకు రుణాలు మంజూరు చేయడంతోపాటు యూనిట్ల ఏర్పాట్లలో కూడా వారికి సాంకేతిక సహాయం అందించి త్వరిగతిన యూనిట్లు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేద ప్రజల సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, అందుకు సంబంధించి అర్హత పొందిన లబ్దిదారులకు నిర్దేశించిన లక్ష్యం మేరకు రుణాలు అందించాలని బ్యాంకు అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా రూడ్ సెట్ ద్వారా అమలు జరుగుచున్న శిక్షణా కార్యక్రమాల వివరాలతో కూడిన బ్రోచర్‌ను జిల్లా కలెక్టర్ రాజాబాబు ఆవిష్కరించారు. ఈ సమావేశంలో లీడ్ జిల్లా మేనేజర్ రమేష్, నాబార్డు అధికారి రవికుమార్, ఆర్బిఐ ఎజిఎం కిషన్ కుమార్, డిఆర్డిఎ, మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్లు నారాయణ, విజయలక్ష్మి, వ్యవసాయ, పశు సంవర్ధక, మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్లు శ్రీనివాసులు, వెంకటేశ్వరరావు, శ్రీనివాస రావు, ఏపిసిపిడిసిఎల్ ఎస్ఈ వెంకటేశ్వరరావు, జిల్లా సెరికల్చర్ అధికారి డాక్టర్ సుజయ్, రూడ్ సెట్ డైరెక్టర్ శ్రీనివాసులరెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, అన్ని జిల్లా బ్యాంకు కోఆర్డినేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

# పండిత గాణాల రామమూర్తి 89వ వర్ధంతి





(షణ్ముఖ వెలుగు, పొదిలి, జూన్ 23)
పండిత గాణాల రామమూర్తి 89వ వర్ధంతి పొదిలి విశ్వబ్రాహ్మణ ఆరామ క్షేత్ర సాధన సమితి ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. తొలుత గాణాల రామమూర్తి చిత్రపటానికి నివాళు లర్పించి విశ్వబ్రాహ్మణ జాతికి చేసిన సేవలను కొనియడారు. విశ్వబ్రాహ్మణ కుటుంబాలలో వెలుగు నింపి, ప్రభుత్వంతో పోరాడి వెనుకబడిన వర్గాల వారిగా గుర్తించి రిజర్వేషన్ అమలు అయ్యేటట్లు చేయించిన ఏకైక వ్యక్తిని విశ్వబ్రాహ్మణ సంఘ నాయకులు రామక్రిష్ణా అన్నారు. ఈ సందర్భంగా వారి సేవలను స్మరిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో పొదిలి విశ్వబ్రాహ్మణ ఆరామ క్షేత్ర సాధన సమితి నాయకులు నూతక్కి నాగేశ్వరరావు, శివక్రిష్ణా, కర్ల సుబ్బారావు, బాణాల రమణయ్య, గొవిందయ్య, లక్ష్మణ, తదితరులు పాల్గొన్నారు.

# 26న వేమూరు తాలుకా ఎపిజిఇఎ ఎన్నికలు


(షణ్ముఖ వెలుగు, వేమూరు, జూన్ 23)
బాపట్ల జిల్లా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం వేమూరు తాలుకా ఎన్నికలు జూన్ 26న వేమూరు మండల పరిషత్ సమవేశ మందిరం నందు జరగనున్నట్లు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం బాపట్ల జిల్లా హాట్ హాక్ కమిటీ చైర్మన్ జివివి రాఘవరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా అయిన మాట్లాడుతూ జివివి రాఘవరెడ్డి ప్రస్తుత కార్యవర్గం పదవీ కాలం ముగియటంతో ప్రస్తుతం ఎన్నికలు అనివార్యం అయినట్లు తెలిపారు. ఈ మేరకు ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించామని తెలిపారు. ఈ ఎన్నికల ఎలక్షన్ ఆఫీసర్ గా కే రోశయ్య, అసిస్టెంట్ ఎలక్షన్ ఆఫీసర్‌గా వై రాజేష్ బాబు వ్యవహరిస్తారని తెలిపారు.

**ఎన్నికల షెడ్యూల్..**

26వ తేదీ నుండి 11 వరకు నామినేషన్ల స్వీకరణ. 11 నుండి 12 వరకు నామినేషన్ వెరిఫికేషన్, సాయంత్రం 1 వరకు ఉపసంహారణ. 1 నుండి 2 గంటల వరకు పోలింగ్. అదే రోజు కౌంటింగ్. అనంతరం గెలుపొందిన అభ్యర్థులను ప్రకటించనున్నారని తెలిపారు. సదరు ఎన్నికల్లో వేమూరు తాలూకా ప్రభుత్వ ఉద్యోగులు అందరూ పాల్గొనాలని ఆయన కోరారు.

# ఫిషింగ్ హార్బర్ నిర్మాణంతో తీర ప్రాంత ముఖచిత్రమే మారిపోతుంది





ప్రత్యేక వాహనాల్లో వీరు పర్యటించారు. స్థానికులతో మాట్లాడారు. ఈ పర్యటనలో వీరి వెంట ఏఎంసి చైర్మన్ రాచగర్ల వెంకట్రావు, ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు, స్థానిక అధికారులు, ప్రజా ప్రతినిధులు ఉన్నారు.



# శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివాస్



(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, జూన్ 23)
శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివాస్ కార్యక్రమాన్ని మంగళవారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. బిజెపి కేంద్ర, రాష్ట్ర, జిల్లా పార్టీ పిలుపు మేరకు పట్టణంలోని గాంధీ బొమ్మ సెంటర్ వద్ద 179వ పోలింగ్ బూత్‌లో శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివాస్ గిద్దలూరు పట్టణ అధ్యక్షులు అప్పిశెట్టి ఉదయ శంకర్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ జీ వి నారాయణ జిల్లా జనరల్ సెక్రెటరీ మాట్లాడుతూ భారతీయ జనసంఘ్ భారతదేశంలో చురుకుగా ఉన్న ఒక రాజకీయ పార్టీఅని అన్నారు. దీనిని 1951 అక్టోబర్ 21న ఢిల్లీలో శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ స్థాపించారు. జనసంఘ్, ఒక మితవాద హిందుత్వ పారామిలిటరీ సంస్థ అయిన రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ యొక్క రాజకీయ విభాగం 1977లో ఇది భారత జాతీయ కాంగ్రెస్‌ను వ్యతిరేకించిన అనేక ఇతర వామపక్ష, మధ్యేవాద, మితవాద పార్టీలతో విలీనమై జనతాపార్టీగా ఏర్పడిందన్నారు. 1980లో పూర్వపు జనసంఘ్ సభ్యులు 1980 సార్వత్రిక ఎన్నికలలో జనతాపార్టీ ఓటమి తర్వాత ఆ పార్టీ నుండి వైదొలిగి భారతీయ జనతా పార్టీని ఏర్పాటు చేశారు. సిద్ధాంతం కోసం, దేశం కోసం, రాజకీయ పార్టీ స్థాపించి, కాంగ్రెస్‌ని, నెహ్రూని ఎదిరించి చివరకు ఒకే దేశం, ఒకే రాజ్యాంగం, ఒకే జెండా అనే లక్ష్యంతో కాశ్మీర్ కోసం తన ప్రాణాలను దేశం కోసం బలిదానం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మైనారిటీ మోర్చా స్టేట్ ఎగ్జిక్యూటివ్ మేంబర్ షేక్ ఖాదర్ వలీ షఫీ, మట్టిమల్ల పుల్లయ్య, మాజీ ఎస్సీ మోర్చ జనరల్ సెక్రెటరీ, గిద్దలూరు మార్కెట్ యార్డ్ డైరెక్టర్ దూదేకుల బాదుల్లా, నెమలిగుండ్ల రంగనాయక స్వామి దేవాలయ కమిటీ మెంబర్ కొప్పుల నరసింహులు, రంగస్వామి దేవస్థానం మెంబర్ రామకృష్ణ, టౌన్ వైస్ ప్రెసిడెంట్ నాగేశ్వరావు, ఉమామహేశ్వరరావు, జై సింహ నాయుడు, పరమేశ్వర నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే తొలి ప్రాధాన్యత ఎమ్మెల్యే ఏలూరి



(షణ్ముఖ వెలుగు, పర్చూరు, జూన్ 23)
ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టడమే తమ లక్ష్యమని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా స్పందిస్తూ ప్రభుత్వ సేవలను అందుబాటులోకి తీసుకురావడంలో కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా వచ్చిన ప్రతి ఒక్కరితో స్వయంగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పింఛన్లు, సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలకు సంబంధించిన వినతులను పరిశీలించి, సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏలూరి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి తొలి ప్రాధాన్యత ఇస్తున్నాం. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ప్రజా దర్బార్ ద్వారా నేరుగా వినతులు స్వీకరించి పరిష్కరిస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు పరుగులు తీస్తున్నాయి. ప్రతి అర్హుడికి ప్రభుత్వ పథకాల ఫలాలు అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రజా దర్బార్‌కు నియోజకవర్గంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, వాటిపై సానుకూలంగా స్పందించి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ ఒలంపిక్ డే సందర్భంగా అట్టహాసంగా ఆటపాటలు

## ప్రధాన ఉపాధ్యాయులు రెబ్బ వెంకటేశ్వర్లు



(షణ్ముఖ వెలుగు, మద్రిపూడి, జూన్ 23)
మండల కేంద్రమైన మద్రిపూడి గ్రామంలోనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు రిలయన్స్ ఫౌండేషన్ మరియు సార్డ్స్ సంస్థ వారి ఆధ్వర్యంలో మంగళవారం అంతర్జాతీయ ఒలంపిక్ డే వేడుకలు అట్టహాసంగా జరిగినాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కళాశాల హెడ్మాస్టర్ ఆర్ వెంకటేశ్వర్లు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 1894 జూన్ 23వ తేదీన ప్రారంభించడం జరిగిందన్నారు. ఆరోగ్యం, శారీరక దృఢత్వం పై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని కోరారు. అన్ని వయసుల వారు ఈ క్రీడల్లో పాల్గొనవచ్చున్నారు. ప్రజల్లో స్నేహం, గౌరవం, ఐక్యత వంటి విలువలను ప్రజల్లో పెంపొందించుకోవడం దీని యొక్క ముఖ్య ఉద్దేశమన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రిలయన్స్ ఫౌండేషన్, సార్డ్స్ సంస్థ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరపడం ఎంతో ఆనందకరమైన విషయమన్నారు. అదే విధంగా పీఈటి ఉపాధ్యాయులు బాలచంద్ర ప్రసంగిస్తూ భారత్ కదలాలి-ఆత్మ నిర్భర్ గ్రామాలు నిర్మిద్దాం అనే స్లోగన్‌తో విద్యార్థిని, విద్యార్థులతో, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులతో గ్రామ పెద్దలతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆరో తరగతి నుంచి పదవ తరగతి విద్యార్థిని విద్యార్థులకు ఆటలు పోటీలు నిర్వహించి బహుమతులను ప్రధానం చేయడం జరిగింది. ఈకార్యక్రమంలో మండల కోఆర్డినేటర్ జి విజయ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.





## అన్ని రైతు సేవ కేంద్రాల్లో రైతన్న మీకోసం కార్యక్రమం





**(షణ్ముఖ వెలుగు, పొదిలి, జూన్ 23)**

మండలంలోని అన్ని రైతు సేవ కేంద్రాల్లో రైతన్న మీకోసం కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా మండల వ్యవసాయ అధికారి దేవిరెడ్డి శ్రీనివాసులు సలకనూతల, కొండాయపాలెం గ్రామాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి చెప్పినటువంటి పంచ సూత్రాల గురించి వ్యవసాయ అధికారి వివరించడం జరిగింది. దీనిలో భాగంగా రాష్ట్రంలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందించే దిశగా అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టులు పూర్తి చేసుకుందాం. సమర్థ నీటి నిర్వహణతో అన్ని ప్రాజెక్టులు నింపుతామన్నారు. పంటలు సమాజంలో నేడు మారుతున్న ఆహారపు అలవాట్లకు అండగుణంగా అన్నదాతలు సాగు పంతులు మార్చుకోవాలని పంటరం మార్పిడి పాటించాలని రాగులు, జొన్నలు సజ్జలు కొరలు వంటి వాటికి మళ్లీ డిమాండ్ వచ్చి చిరుధాన్యాలు సాగు మరింత పెంచాలని తెలియజేశారు. అగ్రిటెక్ సాగుకు టెక్నాలజీ తోడైతే ఇక మనకు రైతులు తిరుగుండదని అందుకే అగ్రిటెక్ ను ప్రోత్సహిస్తున్నామన్నారు. రాష్ట్రంలో ప్రతి రైతుకు ఏపీ ఫార్మర్ రిజిస్ట్రే పథకంలో యూనిక్ ఐడిలను నమోదు తో ప్రభుత్వ పథకాలను వర్తింప చేస్తామన్నారు. డ్రిప్ స్ప్రింకర్లు సేద్యానికి విస్తరించి నీటి వినియోగ సామర్థ్యాన్ని 40 నుంచి 50 శాతం వరకు పెంచి రైతు ఉత్పాదుకదను పెంచడానికి ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని తెలియజేశారు. అలాగే పంటలకు విలువ పెరగాలంటే ఫుడ్ ప్రాసెసింగ్ కూడా జరగాలని ఆయన రైతులను కోరారు. ఈ కార్యక్రమంలో అన్ని రైతు సేవ కేంద్రాల గ్రామ వ్యవసాయ సహాయకులు, ఉద్యానవన సహాయకులు, అన్ని గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## 26న డాక్టర్ వంకాయలపాటి రామకృష్ణ సంస్మరణ సభ



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 23)**

ప్రభుత్వ పాఠ్య పుస్తకాల రచయిత,ప్రముఖ సాహితీవేత్త, రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత అయిన డా.వంకాయలపాటి రామకృష్ణ 5వ వర్ధంతి సందర్భంగా ఆయన సంస్మరణ సభ ఒంగోలులోని హౌసింగ్ బోర్డు కాలనీలో మహిళాభ్యుదయ సమితి కార్యాలయంలో 26వ తేదీ శుక్రవారం సాయంత్రం ఐదు గంటలకు కళామిత్ర మండలి(తెలుగు లోగిలి), నరసం (నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం) సంస్థల సంయుక్త నిర్వహణలో జరపనున్నట్లు కళామిత్రమండలి జాతీయ అధ్యక్షులు డాక్టర్ నూనె అంకమ్మరావు, నరసం (నవ్యాంధ్ర రాష్ట్రరచయిత్రుల సంఘం) గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సభలో నాగభైరవ సాహిత్య పీఠం అధ్యక్షులు డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ, నరసం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సింహాద్రి జ్యోతిర్మయి, శ్రీకృష్ణదేవరాయ సాహిత్య సాంస్కృతిక సంస్థ అధ్యక్షులు కుర్రా ప్రసాద్‌బాబు, ప్రరస గౌరవాధ్యక్షులు మిడసల మల్లికార్జునరావు, ప్రముఖ కవి యు వి రత్నం, కె బాలకోటయ్య, యువ బీరం అరుణ, గుంటూరు సత్యనారాయణ, యం సూర్య కుమారి, రామకృష్ణ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొంటారని పేర్కొన్నారు. కనుక ఈ కార్యక్రమంలో కవులు, రచయితలు, కళాకారులందరూ పాల్గొని సభను విజయవంతం చేయాలని వారు కోరారు.

# విజయవాడలో శవం కనిపించని సాయి కృష్ణ హత్య కేసులో కిరాతక పోలీస్ అధికారి నాగరాజు అరెస్టు పై హర్షం

**క్రాంతి మాదిగ బల్వం మరణం కేసులో కూడా ఖాకి నయీమ్ నాగరాజును అరెస్టు చేయాలి**

**దళిత నేత నీలం డిమాండ్**

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 23)**

విజయవాడలో శవం కనిపించని సాయి కృష్ణ హత్య కేసులో కృష్ణలంక సీఐ నాగరాజును అరెస్టు చేయటం పట్ల దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు నీలం నాగేందర్‌రావు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం అంబేద్కర్ భవన్‌లో జరిగిన సమావేశంలో నీలం నాగేంద్రరావు మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో కాపు కులానికి చెందిన సాయి కృష్ణ కృష్ణ లంక సర్కిల్ ఇన్స్పెక్టర్ నాగరాజు టార్చర్‌తో హత్యకు గురయ్యాడని, శవం కూడా చూపించలేదని, కనీసం బూడిదైన ఇవ్వాలని హతుని తల్లి హైకోర్టులో ఏపీఎస్ కార్పస్ పిటిషన్ వేసిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున కౌంటర్ వేసిన కూటమి ప్రభుత్వం ఈ నెల 29న కౌంటర్ వేస్తామని ఏజిపి ద్వారా తెలిపిందన్నారు. సాయి కృష్ణ విజయవాడలో కృష్ణలంక సీఐ నాగరాజు పోలీస్ హింస తట్టుకోలేక రీసైకిలింగ్ వ్యాపారం, ల్యాండ్ సెటిల్మెంట్లు చేయలేక పారిపోయి మార్కాపురంలో తలదాచుకున్నాడన్నారు. మార్కాపురం నుంచి సాయికృష్ణను కృష్ణలంక పోలీస్ స్టేషన్‌కు తీసుకుని వెళ్లి సిఐ నాగరాజుతో పాటు మరి కొంతమంది పోలీసు అధికారులు కోట్ల రూపాయలు విలువచేసే ల్యాండ్ సెటిల్మెంట్ కిరాతకంగా హింసించడం వల్ల చనిపోయాడని మీడియాలో కథనాలు వస్తున్నాయన్నారు. జనరల్ గా లాకప్ డెత్ జరిగినప్పుడు సంబంధిత పోలీస్ ఉన్నత అధికారులు ఖాకి కథలు చెప్పి హార్ట్ ఎటాక్ తోనో, వాళ్ళ కుటుంబ సభ్యులే అవమానించారని, అతని స్నేహితులే చంపారని చెప్తారన్నారు. కానీ సాయి కృష్ణ కేసులో ఖాకి నయీమ్ కిరాతక ప్లాన్ చేసి సాయి కృష్ణ శవాన్ని తగలబెట్టి బూడిద చేసారన్నారు. స్మశానంలో కూడా సాయి కృష్ణ వయస్సు 25 సంవత్సరాలు



అయితే 45 సంవత్సరాల వయసు, గుర్తు తెలియని శవంగా నమోదు చేయించారన్నారు. ప్రతిపక్షాల పరామర్శలు, ఆందోళనలతో ప్రభుత్వం ఎట్టకేలకు కృష్ణలంక ఖాకి యమకింకరుడు నాగరాజును తప్పనిసరి పరిస్థితుల్లో అరెస్టు చేసిందన్నారు. కానీ అదే కృష్ణలంక పోలీస్ స్టేషన్లో ఖాకి నయీమ్ నాగరాజు వేధింపులకు గురై మాదిగోడినని, తన చేత బూట్లు పాలిష్ చేయించారని, అనేక చిత్రహింసలు చేశారని మనోవేదనతో సెల్ఫీ వీడియో తీసుకొని తన చావుకి కారణం సిఐ నాగరాజు అని వీడియో వైరల్ అయినా కూటమి ప్రభుత్వం కుల వివక్షత చూపించిందన్నారు. పది రోజులైనా క్రాంతి మాదిగ చావుకు కారకుడైన సిఐ నాగరాజు, ఇతర పోలీస్ అధికారుల పై చట్ట ప్రకారం బిఎన్ఎస్ సెక్షన్ 108, ఎస్సీ, ఎస్టీ యాక్ట్‌గా మార్చకపోవడం, పెద్ద మాదిగ చంద్రబాబుకు మాదిగల ప్రాణాల పట్ల ఉన్న ప్రేమకు నిదర్శనం అన్నారు. కాపు సాయి కృష్ణ కుటుంబ సభ్యులను ఇంటికి పిలిపించుకొని ఓదార్చి తమకు ముఖ్యమంత్రి న్యాయం చేశాడని హతుని తల్లితో చెప్పించుకున్న ముఖ్యమంత్రి ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కూటమి ప్రభుత్వ గెలుపు కోసం కృషిచేసిన పేరిపోగు వెంకటేశ్వరరావు చేత కూడా ముఖ్యమంత్రి తమకు న్యాయం చేశాడని చెప్పించుకోవాలన్నారు. మాదిగ క్రాంతి కుమార్ చావుకు కారకుడైన ఆంధ్ర ఖాకి నయీమ్ నాగరాజుతో పాటు పోలీస్ అధికారులని అరెస్టు చేయాలని నీలం నాగేంద్రరావు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దారా అంజయ్య, కాకుమాను రవి, మాదిగ పరిరక్షణ సమితి కన్వీనర్ పత్రా బంగారం, మాల సభ కన్వీనర్ మేడికొండ మురళి, తదితరులు పాల్గొన్నారు.

## అపదలో ఉన్న కుటుంబాలకు అండగా సీఎం సహాయనిధి

### ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

**(షణ్ముఖ వెలుగు, మార్టూరు, జూన్ 23)**



ఆర్థిక ఇబ్బందులతో వైద్య చికిత్సలు చేయించుకోలేని నిరుపేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) ఎంతో భరోసానిస్తోందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్య రక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, అవసరమైన ప్రతి అర్హ కుటుంబానికి సీఎం సహాయనిధి ద్వారా సాయం అందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని తెలిపారు. మంగళవారం ఎమ్మెల్యే ఏలూరి తన క్యాంపు కార్యాలయంలో పలు కుటుంబాలకు సీఎం సహాయనిధి ద్వారా మంజూరైన ఆర్థిక సాయాన్ని అందజేశారు. వలపర్ల గ్రామానికి చెందిన సిహెచ్. కుమారి ఊపిరితిత్తుల క్యాన్సర్‌తో బాధపడుతుండగా, ఆమె చికిత్స కోసం ఎమ్మెల్యే సిఫారసు మేరకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.3,07,453ల చెక్కును అందజేశారు. అదే గ్రామానికి చెందిన షేక్ షర్మిలా హెర్నియా వ్యాధితో బాధపడుతూ వైద్య ఖర్చులు భరించలేని పరిస్థితిలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ఆశ్రయించగా, వైద్య చికిత్స నిమిత్తం సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన రూ.83,399ల ఎల్‌వోసీ (ఎల్ఓసీ) చెక్కును ఎమ్మెల్యే అందించారు. అలాగే జరుబులవారిపాలెం గ్రామానికి చెందిన బోరుగడ్డ భాస్కరరావు అనారోగ్యంతో బాధపడుతూ చికిత్సకు ఆర్థిక స్తోమత లేకపోవడంతో సహాయం కోరగా, అత్యవసర వైద్య ఖర్చుల కోసం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.51,346ల చెక్కును ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏలూరి మాట్లాడుతూ ప్రజల కష్టసుఖాల్లో అండగా నిలవడం ప్రజాప్రతినిధుల బాధ్యత. పేద కుటుంబాలు వైద్య చికిత్సల కోసం అప్పుల పాలుకాకుండా ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ప్రభుత్వం అండగా నిలుస్తోంది. అవసరమైన ప్రతి అర్హ కుటుంబానికి ఈ పథకం ప్రయోజనం అందేలా కృషి చేస్తామన్నారు.

## విద్యార్థులకు నోట్ బుక్స్, వాటర్ బాటిల్స్ పంపిణీ



**(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, జూన్ 23)**

మండలంలోని పెద్ద వెంకన్నపాలెం ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు మంగళవారం పొన్నగంటి సుబ్బారావు రూ 7000 విలువ గల నోట్ బుక్స్, వంజ మనోజ్ మౌనిక దంపతులు రూ 6000 విలువ గల వాటర్ బాటిల్స్ విద్యార్థులకు పంపిణీ చేశారు. దాతలు మాట్లాడుతూ విద్యార్థులు మంచి క్రమశిక్షణతో చక్కగా చదువుకుంటే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చునని, ఎప్పుడు తమ సహకారం విద్యార్థులకు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ రవిచంద్రబాబు, పాఠశాల ఎస్ఎంసి చైర్మన్ భాగ్యలక్ష్మి, ప్రధానోపాధ్యాయుడు జి రామకృష్ణ, చల్లా శ్రీనివాసులు, చల్లా కోటేశ్వరరావు, నవులూరి నరసింహారావు, గ్రామస్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


## ఎలక్ట్రిక్ బస్సులను ఆర్టీసీకే ఇవ్వాలి ప్రైవేట్ ఎలక్ట్రికల్ బస్సులతో ప్రజా రవాణా అస్తవ్యస్తం



**(షణ్ముఖ వెలుగు, పొదిలి, జూన్ 23)**

రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీని ప్రైవేటుపరం చేసే కుట్రలో భాగంగా ఎలక్ట్రికల్ బస్సులు తీసుకొస్తుందని వాటి వల్ల ప్రజా రవాణా పూర్తిగా కుంటుపడే ప్రమాదం ఉందని ఆర్టీసీ జేఏసీ నాయకులు హెచ్చరించారు. మంగళవారం స్థానిక డిపో గేటు వద్ద నాలుగు సంఘాల ఆధ్వర్యంలో జాయింట్ యాక్షన్ కమిటీగా జరిగిన ధర్నా కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ విద్యుత్ బస్సుల పేరుతో ఆర్టీసీని దశలవారీగా ప్రైవేటుపరం చేయాలన్న ప్రభుత్వ ఆలోచన విరమించుకోవాలన్నారు. పేద మధ్య తరగతి ప్రజలకు ప్రజా రవాణాగా దోహదపడే ఆర్టీసీలో విద్యుత్ బస్సుల వల్ల ఈ వ్యవస్థ కుంటుపడే ప్రమాదం ఉందన్నారు. రాష్ట్రంలో 11 డిపోలను ఎంపిక చేసి ఇప్పటికే ఆరు డిపోలలో ఉన్న బస్సులను వేరే వాటికి తరలించి ఎలక్ట్రిక్ బస్సుల కోసం ప్రైవేట్ వారికి అప్ప చెప్పారన్నారు. ఇప్పటికే తిరుపతిలో 100 ఎలక్ట్రిక్ బస్సులతో నిర్వహణ సరిగా లేక ప్రతిరోజు 20 బస్సులు మెయింటెనెన్స్ కింద ఆగిపోతున్నాయన్నారు. వాటి నిర్వహణ మరింత భారమవుతుందని ఎలక్ట్రిక్ బస్సులను ఆర్టీసీ కే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీలో నైపుణ్యమైన చైతన్యవంతమైన ఉన్నత చదువులు చదివిన కార్మిక వర్గం ఉందని ఆర్టీసీ కే ఎలక్ట్రిక్ బస్సులు ఇవ్వాలన్నారు. రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు గేట్ మీటింగ్, ధర్నా కార్యక్రమంలో పొదిలి డిపో జేఏసీ కన్వీనర్లు జీ వి నారాయణ, పి ఓబులేసు, కో కన్వీనర్ జి వేణుగోపాల్ ఆధ్వర్యంలో ఎక్కువ మంది ఆర్టీసీ ఉద్యోగులు ఈ ధర్నా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి బి రోషన్ కుమార్ అధ్యక్షత వహించగా డిపో, జోనల్, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి శిద్దా రాఘవరావుకి శుభాకాంక్షలు తెలిపిన ప్రకాశం జిల్లా ఆర్యవైశ్య సంఘం



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 23)**

మాజీ మంత్రి శిద్దా రాఘవరావుకి అమెరికన్ యూనివర్సిటీ డాక్టరేట్ ఇచ్చిన సందర్భంగా డాక్టర్ శిద్దా రాఘవరావుని ప్రకాశం జిల్లా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆయన నివాసంలో కలసి శాలువాలు, జమాలలతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రకాశం జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు బొగ్గవరపు సుబ్బారావు, ఒంగోలు సూపర్ బజార్ చైర్మన్ పల్లపోతు వెంకటేశ్వర్లు, వాసవి సేవా దళ్ అధ్యక్షులు మోదుకూరి శ్రీనివాసరావు (పెనుగొండ శ్రీను), జిల్లా ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి మువ్వల శ్రీను, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.



## ప్రాథమిక వైద్యశాలలో పల్స్ పోలియో పై శిక్షణ



(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, జూన్ 23)
స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం పల్స్ పోలియోపై వైద్య సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వైద్య అధికారులు మాట్లాడుతూ పొన్నలూరు మండల పరిధిలో అన్ని గ్రామాలలో మొత్తం 25 పల్స్ పోలియో బూతుల్లో జరుగునని, మొత్తం 3290 పిల్లలకు 0 నుండి 5 సంవత్సరాల వయసుగల పిల్లలకు పోలియో చుక్కలు ఇవ్వటం జరుగుతుందని తెలిపారు. పిల్లల తల్లిదండ్రులు ఈనెల 28 29 30 తేదీలలో పల్స్ పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య అధికారులు రవి కిరణ్,మల్లికార్జున, సునీల్ రెడ్డి, సింధు, సిహెచ్ఓ భాస్కరరావు, సుజాత, గిరిజ, శ్రీనివాసరావు ఏ ఎన్ ఎం లు, ఎంఎల్‌హెచ్‌పి లు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## నవచేతన ఏఐ స్క్రీనింగ్ పై అవగాహన



(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, జూన్ 23)
మండలంలోని చిన్నగంజాం పంచాయతీ ఏరియాలోని పూలవారిపాలెం అంగన్వాడీ కేంద్రం నందు మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సూపర్వైజర్ సుమలత పర్యవేక్షణలో తల్లిదండ్రులకు 0–6 సంవత్సరాల పిల్లల బాల్య వికాస స్క్రీనింగ్ పై కృత్రిమ మేధస్సు (ఏఐ) ఆధారిత నవచేతన పై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ సుమలత మాట్లాడుతూ ప్రతి చిన్నారి జీవితంలో అత్యుత్తమ ఆరంభాన్ని అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం 'నవచేతన' పేరుతో బాల్యారంభ అభివృద్ధి (ఎర్లీ చైల్డ్ హుడ్ డెవల్‌పమెంట్) ఈసీడీ స్క్రీనింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు.గర్భధారణ నుంచి రెండేళ్ల వయస్సు వరకు ఉండే తొలి వెయ్యి రోజులు చిన్నారి జీవితంలో అత్యంత కీలకమైన కాలం అని అట్టి సమయంలో అందే పోషకాహారం, ఆరోగ్య సంరక్షణ, స్పందనాత్మక సంరక్షణ, ప్రారంభ అభ్యసన అవకాశాలు, భద్రత, పిల్లల భవిష్యత్తు, విద్య, ఆరోగ్యం, ఉత్పాదకత, శ్రేయస్సుపై ప్రభావం చూపుతాయన్నారు. బాలల అభివృద్ధిలో ఆలస్యాలను ముందుగానే గుర్తించి సకాలంలో జోక్యం చేసుకోవలని కోరారు. ఈ కార్యక్రమంలో సుమలత, సుజాత, నాగమణి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## రూ.50 కోట్లతో బీసీ బాలుర గురుకుల పాఠశాల మంజూరు చేయించిన ఎమ్మెల్యే ముత్తుముల




(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, జూన్ 23)
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కేబినెట్ సమావేశంలో గిద్దలూరు నియోజకవర్గానికి రూ.50 కోట్లతో బీసీ బాలుర గురుకుల పాఠశాల మంజూరు కావడం పట్ల గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వెనుకబడిన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం ఎంతో అభినందనీయమని తెలిపారు. గిద్దలూరు నియోజకవర్గానికి బిసి బాలుర గురుకుల పాఠశాల స్కూల్ మంజూరు చేయడం వల్ల గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు మెరుగైన విద్యా అవకాశాలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. ఈ పాఠశాల మంజూరుకు సహకరించిన కూటమి ప్రభుత్వానికి, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, బీసీ సంక్షేమశాఖ మంత్రి సవితకి ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# శ్రీగిరిలో వేడుకగా ధ్వజా రోహణం


### ఆధ్యాత్మిక ఉపన్యాసంతో అలరించిన పొన్నూరు వెంకట శ్రీనివాసులు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 23)
ఒంగోలు లోని కుర్తాళం శ్రీ సిద్దేశ్వరి పీఠ పాలిత శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి త్రయాహ్నిక బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం ఉదయం శ్రీగిరి దేవస్థానం అర్చకులు వేద పండితులు శ్రీవారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. వైఖానస ఆగమ పండితులు పరాంకుశం సీతా రామాచార్యులు బృందం ఆధ్వర్యంలో ధ్వజారోహణంతో పాటు శ్రీవారి ఉత్సవ మూర్తులకు విశేష స్నపన తిరుమంజనం కార్యక్రమాన్ని వేడుకగా శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం శ్రీవారికి హనుమంత వాహన సేవను నేత్ర పర్వంగా నిర్వహించారు. ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు, ప్రముఖ ఆధ్యాత్మిక ఉపన్యాసకులు పొన్నూరు వేంకట శ్రీనివాసులు 'శ్రీ వెంకటాచల మహత్యం – శ్రీవారి పాద సౌందర్యం' అన్న అంశం పై ప్రసంగించారు. సాక్షాత్తు ఆ మహావిష్ణువు వైకుంఠం నుంచి తరలివచ్చి కలియుగ వైకుంఠమైన తిరుమలగిరులలో వేంకటేశ్వర స్వామిగా వెలిశారని అన్నారు. స్వామివారి నఖశిఖ పర్యంతం సుందర రూపాన్ని ధరించినా స్వామివారి పాద సౌందర్యం మోక్షానికి మార్గమని అన్నారు. సాక్షాత్తు శ్రీదేవి భూదేవి, ఆదిశేషుడు, పరమేశ్వరుడు, ఇంద్రుడు, మహర్షులు లాంటి మరెందరో స్వామి వారి యొక్క పాద సౌందర్యానికి ముగ్ధులై సర్వస్య శరణాగతిని పొందారని అన్నారు. శ్రీనివాస పాద చరణ కైంకర్యానికి మించిన మరో కైంకర్యం లేదని తెలిపారు. అనంతరం శ్రీగిరి దేవస్థానం పక్షాన స్వామి వారి శేష వస్త్రంతో ఉపన్యాసకులు పొన్నూరు వేంకట శ్రీనివాసులుని ఘనంగా సత్కరించి వేద ఆశీర్వచనం అందజేశారు. శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి, ఆర్జిత సేవల ధర్మకర్త ఆలూరు సుశీలా దేవి, కార్యనిర్వహణ ధర్మకర్త సివి రామకృష్ణారావు, శ్రీగిరి దేవస్థానం ఉత్తర అమెరికా ప్రతినిధి డాక్టర్ ఆలూరు శ్రీనివాస చరణ రాజీవ్, ధర్మకర్తలు ఆలూరు వెంకటేశ్వరరావు, ఆలూరు లక్ష్మీ కుమారి, ఆలూరు జై శంకర్, ఆలూరు కుమార ఆత్రేయ, తదితరులు కార్యక్రమాలను పర్యవేక్షించారు. భక్తులకు శ్రీవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. శ్రీగిరి బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం సాయంత్రం 7 గంటలకు శ్రీవారికి ఊంజల సేవ, శ్రీగిరి దేవస్థానం ఆస్థాన సంగీత విద్వాంసులు వివిఎస్ వినోద్ కుమార్ చే భక్తి సంగీత విభావరి జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.



**పెద్ద సంఖ్యలో భక్తులు రాక :**
శ్రీగిరి దేవస్థానం నిర్వాహకులు దేవస్థానం మహా మండపం సీలింగ్ పై రూపొందించిన వితాన అష్టదిక్పాలక పరివృత వటపత్ర శాయిని దర్శించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేశారు. కళాకారుల సృజనాత్మక ప్రతిభను, శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి కృషిని పలువురు అభినందించారు.



## మళ్లీ గంజాయి పట్టివేత





(షణ్ముఖ వెలుగు, కందుకూరు, జూన్ 23)
కందుకూరు ప్రాంతంలో గంజాయి రవాణా, విక్రయాలకు పాల్పడుతున్న ఇద్దరు యువకులను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 2 కిలోల 350 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. కందుకూరు పట్టణం బండపాలెం ప్రాంతానికి చెందిన కత్తుల కిషోర్, గుడ్లూరు ఎస్టీ కాలనీకి చెందిన కామంచి రాజేష్‌ను అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెట్టారు. కందుకూరు డిఎస్పీ కార్యాలయంలో మంగళవారం కేసు వివరాలను డిఎస్పీ బాల సుబ్రహ్మణ్యం వివరించారు. గుడ్లూరు గ్రామానికి చెందిన నాగులూరి తిరుపతయ్య వద్ద నుండి గంజాయి కొనుగోలు చేసి వీరిద్దరూ కందుకూరు ప్రాంతంలో విక్రయిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కత్తుల కిషోర్‌ను విచారించగా అతను గంజాయి కొనుగోలు చేసి తాను వినియోగించడమే కాకుండా చిన్న, చిన్న ప్యాకెట్లుగా తయారు చేసి ఒక్కో ప్యాకెట్ రూ.200 చొప్పున విక్రయిస్తున్నట్లు అంగీకరించినట్లు పోలీసులు చెప్పారు. అతను దాచిపెట్టిన 1.100 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కామంచి రాజేష్‌ను విచారించగా ఒడిశా బార్డర్, విశాఖపట్నం, రాయగడ ప్రాంతాల నుండి గంజాయిని కొనుగోలు చేసి ప్రకాశం జిల్లాకు రవాణా చేసి విక్రయిస్తున్నట్లు చెప్పాడు. అతని వద్ద నుండి 1 కిలో 250 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. రాజేష్ కొంత కాలంగా ఒడిశా సరిహద్దు ప్రాంతాల నుండి గంజాయిని కొనుగోలు చేసి గుడ్లూరు, కందుకూరు ప్రాంతాలలో పలువురికి విక్రయిస్తున్నట్లు విచారణలో తేలిందని పోలీసులు తెలిపారు. కేసును ఛేధిండంలో కృషి చేసిన కందుకూరు సిఐ అన్వర్ భాష, కందుకూరు రూరల్ ఎస్ఐ ఏ బాలకృష్ణ, టౌన్ స్టేషన్ సిబ్బందిని జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు ప్రత్యేకంగా అభినందించారు.

## వ్యవసాయ రంగంపై ఎల్నినో ప్రభావం బ్రోచర్ ఆవిష్కరణ

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 23)
ఒంగోలు నగరంలోని రూడ్ సెట్ ద్వారా అమలు జరుగుచున్న శిక్షణా కార్యక్రమాల వివరాలతో కూడిన బ్రోచర్‌ను, వ్యవసాయ రంగం పై ఎల్నినో ప్రభావంను అధికమించేలా చేపట్టవలసిన చర్యల పై వ్యవసాయ శాఖ రూపొందించిన బ్రోచర్‌ను జిల్లా కలెక్టర్ రాజాబాబు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో లీడ్ జిల్లా మేనేజర్ రమేష్, నాబార్డు అధికారి రవికుమార్, ఆర్‌బిఐ ఏజిఎం కిషన్ కుమార్, డిఆర్డిఎ, మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్లు నారాయణ, వ్యవసాయ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాసరావు, రూడ్‌సెట్ డైరెక్టర్ శ్రీనివాసుల రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.







## దళిత యువకుడు క్రాంతి కుమార్ ఆత్మహత్య పై సమగ్ర విచారణ జరిపించాలి

### సీఐ నాగరాజును అరెస్టు చేయాలి
### బాధిత క్రాంతి కుమార్ కుటుంబానికి రక్షణ కల్పించాలి
### ఐఎఫ్‌టియు డిమాండ్

(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, జూన్ 23)
దళిత యువకుడు క్రాంతి కుమార్ ఆత్మహత్య పై సమగ్ర విచారణ జరిపించాలని, క్రాంతి కుమార్ ఆత్మహత్యకు కారకుడైన కృష్ణలంక సీఐ నాగరాజును వెంటనే అరెస్టు చేయాలని, క్రాంతి కుమార్ కుటుంబానికి ప్రభుత్వం రక్షణ కల్పించాలని ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్ మోహన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విజయవాడలోని పకీర్ గూడెం లబ్బీపేటకు చెందిన ఎమ్మార్పీఎస్ నాయకుడు పేరు పోగు వెంకటేశ్వరరావు కుమారుడు క్రాంతి కుమార్ ను మే నెల 21వ తేదీ కృష్ణలంక పోలీసులు సిఐ నాగరాజు పిలుస్తున్నాడని ఆయన ఇంటికి వెళ్లారు. ఇంట్లోనే ఉన్న క్రాంతి కుమార్ అప్పటికి సిఐ బేధింపులకు టార్చర్‌కు గురవుతూ ఉన్నాడు. దాంతో సిఐ రమ్మన్నాడు అనగానే భయపడి ఇంట్లోనే పురుగుల ముందు తీసుకుని సెల్ఫీ వీడియోలో తన మరణానికి సిఐ నాగరాజు వేధింపులే కారణమని, ప్రతి రోజు పోలీస్ స్టేషన్‌కు పిలిపించుకొని టార్చర్ చేస్తున్నాడని ఆరోపించాడు. ఇటీవల గాదె సాయి కృష్ణ మార్కాపురంలో మే తొమ్మిదో తేదీన అరెస్టు చేయబడి కృష్ణలంక పోలీస్ స్టేషన్లో లాకప్ డెత్ గురై శవం కూడా అదృశ్యం చేయబడిందని ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో క్రాంతి కుమార్ ఆత్మహత్య చేసుకుంటూ విడుదల చేసిన సెల్ఫీ వీడియో వైరల్ అయిందన్నారు. మే నెలలోని కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలో నలుగురు యువకులు సిఐ నాగరాజు వేధింపులు భరించలేక మరణించారన్నారు. ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో దళితుడైన క్రాంతి కుమార్ ఆత్మహత్య పోలీసులు రాష్ట్రంలో అత్యంత దుర్మార్గంగా దళిత, వెనుకబడిన కులాల యువకులను ఏ విధంగా హత్య చేసి శవాలను కూడా మాయం చేస్తున్నారనేదానికి ఒక నిదర్శనమని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో వైసీపీ ప్రభుత్వంలో నువ్వు కూడా వైసిపి ఎమ్మెల్సీ అనంతబాబు దళితుడైన డ్రైవర్ సుబ్రహ్మణ్యాన్ని హత్య చేసి డోర్ డెలివరీ చేసిన ఘటనలు ఉన్నాయన్నారు. ఈ నేపథ్యంలోని తెలుగుదేశం కూటమి ప్రభుత్వం కూడా అత్యంత దుర్మార్గంగా దళిత యువకులపై హింసకాండ కొనసాగిస్తుందన్నారు. అందులో భాగంగానే క్రాంతికుమార్ ఆత్మహత్య కూడా అని అన్నారు. అందువలన దళితుడైన క్రాంతి కుమార్ ఆత్మహత్యకు కారకుడైన సిఐ నాగరాజును వెంటనే అరెస్ట్ చేయాలన్నారు. ఈ దుర్ఘటన పై సమగ్ర విచారణ జరిపించాలన్నారు. బాధిత క్రాంతి కుమార్ కుటుంబానికి రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# బాలల హక్కుల పరిరక్షణలో అధికారులంతా పూర్తి భాధ్యత వహించాలి

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 23)

## ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మెన్ వేటుకూరి






బాలల హక్కుల పరిరక్షణలో అధికారులంతా పూర్తి భాధ్యత వహించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మెన్ వేటుకూరి ఏవియస్ సూర్య నారాయణ రాజు, సభ్యుడు ఉండవల్లి గాంధీ బాబు తెలియజేశారు. ప్రకాశం జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ, బాలల సంరక్షణ విభాగాలు, కార్మిక, విద్యా, పోలీసు, వైద్య ఆరోగ్య, గ్రామీణ అభివృద్ధి శాఖలు, బి సి వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్, సాంఘిక సంక్షేమ శాఖల అధికారులు, బాలలతో కలసి పని చేస్తున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ వి నాగమణి ఆధ్వర్యంలో రివ్యూ మీటింగ్ జరిగింది. జిల్లాల్లో ఇటీవల కాలంలో నమోదైన బాలకార్మిక కేసులు ఎన్ని, వీరికి ప్రభుత్వం అందిస్తున్న గ్రాంట్ పై ఎటువంటి చర్యలు చేపట్టారు. లబ్ది పొందిన వారి పూర్తి వివరాల పై కార్మిక శాఖాధికారులు నుండి ఆరా తీశారు. అలాగే ఈ జిల్లాలో గత రెండేళ్లుగా జరిగిన బాల్య వివాహాల కేసులు ఎన్ని నమోదు జరిగాయి, పోలీసులు ఎన్ని ఎఫ్ఐఆర్‌లు బుక్ చేశారు. బాండెడ్ లేబర్‌లో ఎన్ని కేసులు నమోదు చేశారు. ఎంత మంది బాలికలను తిరిగి బడిలో చేర్పించారు. వారి వివరాలు, ఫాలో అప్ రిపోర్ట్స్, బాల్య వివాహాల చట్టం పై ఎన్ని అవగాహనా కార్యక్రమాలు చేపట్టారో చర్చించారు. పోక్సో కేసులు యెన్ని నమోదు చేశారు,ఆయా కేసుల్లో జన్మించిన పిల్లలకు జనన ధృవీకరణ పత్రాలు జారీ చేయడంలో ఎదురౌతున్న సమస్యలపై వైద్య ఆరోగ్య శాఖ,స్త్రీ,శిశు సంక్షేమశాఖ, విద్యా శాఖల సమన్వయం పై అధికారులుతో చర్చించారు. అలాగే కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల్లో బాలల హక్కుల ఉల్లంఘనలు ఏ రూపంలో జరుగుతున్నాయి. విద్యా శాఖ, చైల్డ్ లైన్ విభాగం, స్త్రీ, శిశు సంక్షేమ శాఖలు సమన్వయంతో ఎలా వీటిని ఎలా అధిగమిస్తున్నారో కూలంకషంగా చర్చించారు. అలాగే మరిన్ని బాలల హక్కులు వారి సంక్షేమం పై ప్రభుత్వ శాఖల సహకారం, నిరాసక్తత వ్యక్తపరుస్తున్న అధికారుల వివరాలు సేకరించారు. అధికారులు తప్పనిసరిగా ఒకరికి ఒక్కరు సహకరించాల్సిందిగా ఆదేశాలు జారీచేశారు. హాస్టల్ లో ఉండే విద్యార్థులకు సంబంధించి వైద్య ఆరోగ్యశాఖ, వాటర్, శానిటేషన్ మున్సిపల్ శాఖ సమన్వయంతో సహకరించుకొని సీజనల్ వ్యాధులు రాకుండా పిల్లలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి అని తెలియజేశారు. అలాగే గిరిజన ప్రాంతాల్లోని వివిధ సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు అందుతున్న శుచి, సుభ్రతతో భోజనం అందుతున్న తీరు తెన్నులు,ప్రభుత్వం నుండి అందుతున్న సహాయ సహకారాలు, అధికారులు సమన్వయం పై చర్చించారు. కేసు నష్ట పరిహారంలో పోలీసు, వైద్యా ఆరోగ్య శాఖ, మహిళా, శిశు సంక్షేమశాఖ, జుడిషియల్ అధికారులు భాధితులకు సత్వరం న్యాయం జరిగేలా అలాగే నిందితులకు శిఖ పడేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గిరిజన ప్రాంతాల్లో తండ, గూడెం, గైర్హాజరవుతున్న ఉపాధ్యాయులు, నాన్ టీచింగ్ ఉద్యోగుల వివరాల పై ఆరా తీశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని శాఖల అధికారుల సమన్వయంతో బాలల హక్కులు గెలవాలి, వారి సంక్షేమ శాతం నెరవేరాలనే ఏకైక ధ్యేయంతో పాటు చర్చించిన వివిధ అంశాలతో ప్రభుత్వానికి వివిధ సిఫారసులు చేయనున్నామని అన్నారు. రవాణాశాఖ ఆధ్వర్యంలో ఎన్ని స్కూల్స్ బస్సులు కండిషన్‌లో ఉన్నాయి. ఎన్ని పర్మిషన్‌లు ఇచ్చారు. వారి లైసెన్సు ఎప్పుడు రెన్యువల్ చేసియున్నారు. వివరములు రవాణాశాఖ అధికారుల నుండి అడిగి తెలుసుకొని ఉన్నారు. రాష్ట్రంలో బాలల హక్కుల పరిరక్షణ, చట్టాల పై అవగాహన కల్పించే దిశగా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ పని చేస్తుందని చైర్మెన్ వేటుకూరి ఏవియస్ సూర్య నారాయణరాజు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యం నాగమణి, జిల్లా మహిళాభివృద్ధి శిశు సంక్షేమ, సాధికారిత అధికారిణి, సీడీపీవో డీసీపీవో పి దినేష్ కుమార్, సౌందర్య, అధికారి సునీత, తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల అపరిష్కృత సమస్యలను పరిష్కరించాలి



(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, జూన్ 23)

ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న టెట్ సమస్యలను, ఇతరత్రా అపరిష్కృత డిమాండ్లను పరిష్కరించాలని ఐక్య ఉపాధ్యాయ రాష్ట్ర ఫెడరేషన్ గౌరవ అధ్యక్షుడు కొమోజి శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యుడిఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా మండలంలో పలు పాఠశాలను యుటిఎఫ్ నాయకులు సందర్శించి సభ్యత్వాలను నమోదు చేసారు. ఈ సందర్భంగా ఐక్య ఉపాధ్యాయ రాష్ట్ర ఫెడరేషన్ గౌరవ అధ్యక్షుడు కొమోజి శ్రీనివాసరావు మాట్లాడుతూ సర్వీసు లో వున్న ఉపాధ్యాయులను టేట్ నుండి మినహాయించాలని వారికి ప్రత్యేక టేట్ నిర్వహించాలని కోరారు. కమటీ సభ్యులు ఎస్ పాపారావు మాట్లాడుతూ సరేండర్ లీవ్ బకాయిలు చెలించాలని, పెండింగ్ డిఎలను ప్రకటింశాలని, 12వ పిఅర్సి కమిటీని ప్రకటించి ఐఅర్ ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. ఉపాధ్యాయ ఉద్యోగుల ఇబ్బందులను గుర్తించి పరిష్కరించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం మీద ఉందని రాష్ట్ర పేద్దలు చోరవ తిసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు సిహెచ్ వెంకట్, మండల ప్రధానకార్యదర్శి మెట్టు శ్రీనివాసరావు, మండల సహాధ్యక్షులు షేక్ నాయబ్ రసూల్, సురేష్, రవి, సిహెచ్ కుమార్, ఎన్ శ్రీనివాసరావు, హరి పురుషోత్తం, ఎస్ ప్రసాద్, ఇతర మండల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక ఓటర్ల సమగ్ర సవరణ





(షణ్ముఖ వెలుగు, పామూరు, జూన్ 23)

పామూరు పట్టణ పరిధిలో క్లస్టర్ ఇంచార్జ్‌స్ అడుసుమల్లి ప్రభాకర్ చౌదరి అధ్యక్షతన ప్రత్యేక ఓటర్ల సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా మై టిడిపి యాప్ ద్వారా అప్‌లోడ్ చేయుటకు "అవగాహన సమావేశం" నిర్వహించారు. ఈ సమావేశంలో క్లస్టర్ ఇంచార్జి గుంటుపల్లి శ్రీనివాసులు, పట్టణ యూనిట్ ఇంచార్జ్‌స్, ఉప్పలపాటి హరిబాబు, యస్ కె గౌస్ బాషా, ఇర్రి శ్రీనివాసులురెడ్డి, 18బూత్ కమిటి ఇంచార్జ్‌స్, బూత్ లెవెల్ అసిస్టెంట్స్ అందరు హాజరయ్యారు. ఈ సందర్భంగా క్లస్టర్ ఇంచార్జి అడుసుమిల్లి ప్రభాకర్ చౌదరి మాట్లాడుతూ ఇంటింటి సర్వే కార్యక్రమంలో బూత్ లెవెల్ ఆఫీసర్లతో తెలుగుదేశం పార్టీ బూత్ లెవెల్ అసిస్టెంట్స్ సంయుక్తంగా కలిసి ఓటర్ల పరిశీలన కార్యక్రమంలో పాల్గొంటూ మై టిడిపి యాప్ ద్వారా అప్ లోడ్ చేయాలని కోరారు.

# పేదరికాన్ని జయించిన ప్రతిభ విట్‌లో ఉచిత ప్రవేశం

**ఇంటర్ ఎంపీసీలో 959 మార్కులతో జిల్లాలో ద్వితీయ స్థానం**

**కారు డ్రైవర్ కుమారుడికి అమరావతి విట్‌లో ఫ్రీ సీటు**

**ఎమ్మెల్యే ఏలూరిని కలిసిన తల్లిదండ్రులు**

**అభినందించిన ఎమ్మెల్యే ఏలూరి**



(షణ్ముఖ వెలుగు, మార్టూరు, జూన్ 23)

పేదరికం చదువుకు అడ్డు కాదని మార్టూరు హనుమంతరావు కాలనీకి చెందిన విద్యార్థి పెద్దిపాగ ఆమోసు మరోసారి నిరూపించాడు. తండ్రి పెద్దిపాగ నాగరాజు కారు డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. అత్యంత పేద కుటుంబం నుంచి వచ్చిన ఆమోసు, చదువులో మాత్రం ఆణిముత్యంగా నిలిచాడు. మార్టూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ఎంపీసీ చదివిన ఆమోసు, 959 మార్కులతో జిల్లాలో ద్వితీయ స్థానం సాధించాడు. అత్యంత ప్రతిభావంతులైన విద్యార్థులకు ఉచిత ప్రవేశం కల్పించే అమరావతిలోని విట్ యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలలో ఈ ర్యాంకు ఆధారంగా ఆమోసుకు ఫ్రీ అడ్మిషన్ లభించింది. తమ కుమారుడి విజయంపై హర్షం వ్యక్తం చేస్తూ, ఆమోసు తల్లిదండ్రులు స్థానిక ఎమ్మెల్యే ఏలూరిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏలూరి ఆమోసు ను శాలువాతో సత్కరించి అభినందించారు. ఉన్నత చదువులు చదవాలని, అత్యుత్తమ ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు.

# 66 మంది లబ్ధిదారులకు రూ.66.59 లక్షల సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే దామచర్ల

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 23)

అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి అండగా నిలుస్తోందని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ రావు అన్నారు. నగరంలోని టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో 66 మంది లబ్ధిదారులకు రూ.66.59 లక్షల విలువైన చెక్కులను అందజేశారు. పేదల వైద్య ఖర్చులకు ప్రభుత్వం నిరంతరం భరోసాగా ఉంటుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఒంగోలు నగరంలోని టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ రావు పాల్గొని లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన పేద కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్నామని తెలిపారు. ఈ విడతలో 66 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.66 లక్షల 59 వేల 772 విలువైన చెక్కులను పంపిణీ చేసినట్లు చెప్పారు. గత రెండేళ్ల కాలంలో ఒంగోలు నియోజకవర్గానికి చెందిన బాధితులకు మొత్తం రూ.20 కోట్ల 54 లక్షల 24 వేల 411 రూపాయలను సీఎంఆర్ఎఫ్ ద్వారా అందించామని వెల్లడించారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకుని ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారు వైద్య బిల్లులతో తమ కార్యాలయాన్ని సంప్రదిస్తే, అర్హత మేరకు సీఎం సహాయ నిధి మంజూరు అయ్యేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ అవకాశాన్ని ప్రతి అర్హత గల కుటుంబం వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నగర టీడీపీ అధ్యక్షుడు బండారు మదన్, సూపర్ బజార్ చైర్మన్ పల్లపోతు వెంకటేశ్వర్లు, మార్కెట్ యార్డ్ చైర్మన్ రాచగర్ల వెంకట్రావు, 24వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు గుంటూరు రాంబాబు, మాజీ కార్పొరేటర్లు, తదితరులు పాల్గొన్నారు.







# విద్యార్థుల రవాణాకు చేయూత

**ఎమ్మెల్యే ఏలూరి చేతుల మీదుగా**

**రూ. 1 లక్ష చెక్కు ప్రిన్సిపల్ కు అందజేత**

(షణ్ముఖ వెలుగు, యద్దనపూడి, జూన్ 23)

మండలంలోని గన్నవరం గ్రామంలోని ఉన్నత పాఠశాలకు చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో విద్యార్థులు చదువుకోవడానికి వస్తుంటారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులపై రవాణా ఖర్చుల భారం పడుతుండటంతో, దానిని తగ్గించేందుకు గన్నవరం గ్రామ పెద్దలు ముందుకొచ్చారు. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు చేతుల మీదుగా ఈ చెక్కును పాఠశాల ప్రిన్సిపాల్‌కు అందజేశారు. చిమటవారిపాలెం, కటారివారిపాలెం గ్రామాల నుంచి పాఠశాలకు వచ్చే విద్యార్థుల ఆటో రవాణా ఖర్చులను భరించేందుకు గ్రామ పెద్దలు రూ.లక్ష చెక్కును అందజేశారు. విద్యార్థుల ప్రయోజనార్థం గ్రామ పెద్దలు చూపిన ఈ చొరవను స్థానికులు ప్రశంసిస్తున్నారు.

# ఒంగోలు జవహర్ నవోదయ విద్యాలయం మేనేజ్మెంట్ కమిటీ సమావేశం





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 23)
ఒంగోలు జవహర్ నవోదయ విద్యాలయం మేనేజ్మెంట్ కమిటీ సమావేశం మంగళవారం జిల్లా కలెక్టర్, విద్యాలయ కమిటీ చైర్మన్ పి రాజాబాబు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా విద్యాలయం యొక్క ప్రగతి గురించి గత సంవత్సరంలో 10వ తరగతి, 12 తరగతులలో సాధించినటువంటి ఫలితాలు గురించి, విద్యాలయంలో క్రీడలు, పురోభివృద్ధి గురించి, విద్యార్థుల యొక్క భవిష్యత్తు గురించి పలు అంశాలను, అన్ని విషయాలను నవోదయ విద్యాలయ ప్రిన్సిపల్ సి శివరాం, జిల్లా కలెక్టర్‌కు వివరించారు. జిల్లా కలెక్టర్ పి రాజబాబు మాట్లాడుతూ జవహర్ నవోదయ విద్యాలయ ప్రగతి కోసం ఎల్లప్పుడూ సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యాలయ వైస్ ప్రిన్సిపాల్ ఎ రఘు, ఆంధ్ర కేసరి విశ్వవిద్యాలయ రిజిస్ట్రర్ ప్రొఫెసర్ బి హరిబాబు, ఒంగోలు ఆర్‌డిఓ చంద్రశేఖర్ నాయుడు, జిల్లా విద్యాధికారి రేణుక, జిల్లా వైద్య అధికారి డాక్టర్ సి వెంకటేశ్వర్లు, ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, విద్యా అభివృద్ధి కమిటీ మెంబర్లు, తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం విద్యాలయ వైస్ ప్రిన్సిపాల్ ఎ రఘు అందరికి వందన సమర్పణ తెలిపారు.

# ప్రతి ఒక్కరు సర్ సర్వే కార్యక్రమంలో పేర్లను పరిశీలించుకోవాలి





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 23)
భారత ఎన్నికల సంఘం నిర్దేశించిన ప్రకారం ప్రతి ఒక్కరు సర్ సర్వే కార్యక్రమంలో వచ్చేటటువంటి అధికారులకు సహకరించి తమ యొక్క పేర్లను పరిశీలించుకోవాలని స్థానిక ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు అన్నారు. సర్ సర్వే కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే నివాసంలో ఒంగోలు ఆర్డిఓ దరఖాస్తు ఫారాన్ని అందించారు. సర్ సర్వే కార్యక్రమం చాలా విలువైనదని అనేక సంక్షేమ కార్యక్రమాలకు కూడా ఈ సర్వే ద్వారా ఉపయోగపడుతుందని ప్రజలు ఉపయోగించుకోవాలన్నారు. మీ ఇంటి వద్దకు సర్వేకి సంబంధించి బిఎల్వోలు వచ్చినప్పుడు పూర్తి సమాచారాన్ని అందించి మీ ఇంటిలో ఉన్నటువంటి వారి పేర్లను నమోదు చేయించుకుని ప్రభుత్వ కార్యక్రమాలు సంక్షేమ ఫలాలు అందే విధంగా చూసుకోవాలని, ఇది చాలా విలువైన కార్యక్రమాన్ని అందరూ ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాలూరి వెంకటేశ్వరరెడ్డి, గడ్డం ఆదినారాయణ, మేడికొండ మోహన్, తదితరులు ఉన్నారు.

# ఏపీయన్‌జిఓ అసోసియేషన్ చరిత్రలో మరో చారిత్రాత్మక మైలురాయి

**ప్రభుత్వ రంగ సంస్థలు, గురుకుల ఉద్యోగుల రిటైర్మెంట్ వయస్సు 62 ఏళ్లకు పెంపు**
**11,000 మందికి పైగా ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం వర్తింపు**
**రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయం పట్ల ఏపీ యన్‌జిఓ అసోసియేషన్ ప్రకాశం జిల్లా శాఖ హర్షం**
**ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి కృతజ్ఞతలు**

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 23)
ఎన్జీవోస్ అసోసియేషన్ ఉద్యోగుల సంక్షేమం కోసం సాగించిన పోరాటంలో మరో రెండు చారిత్రాత్మక విజయాలు నమోదయ్యాయి. గత నాలుగు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల కీలక డిమాండ్లకు రాష్ట్ర మంత్రివర్గ సమావేశం (క్యాబినెట్) ఆమోదం తెలపడం పట్ల ఏపీయన్‌జిఓ అసోసియేషన్ ప్రకాశం జిల్లా శాఖ హర్షం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా ఏపీ జేఏసీ ప్రకాశం జిల్లా చైర్మన్, ఏపీయన్‌జిఓ అసోసియేషన్ ప్రకాశం జిల్లా అధ్యక్షులు కె శరత్ బాబు, ఏపీజేఏసి కో ఛైర్మెన్, ఏపీ యన్‌జిఓ అసోసియేషన్ ప్రకాశం జిల్లా కార్యదర్శి ఆర్‌సిహెచ్ కృష్ణారెడ్డిలు సంయుక్తంగా ఒక ప్రకటన విడుదల చేస్తూ, క్యాబినెట్ ఆమోదించిన రెండు కీలక నిర్ణయాల వివరాలను వెల్లడించారు. గత నాలుగేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలు, గురుకుల విద్యాలయాల ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 60 సంవత్సరాల నుండి 62 సంవత్సరాలకు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. జీవో నంబర్ 57 ప్రకారం 01-09-2004 కంటే ముందు నోటిఫై చేయబడి, వివిధ కారణాలతో నిలిచిపోయిన సుమారు 11,000 మంది ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని వర్తింపజేసేందుకు క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందన్నారు. గత నాలుగేళ్లుగా అనేక కారణాలతో తిరస్కరణకు గురవుతూ వస్తున్న ఈ రెండు ప్రధాన సమస్యలను ఏపీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్ అలపర్తి విద్యాసాగర్ నేతృత్వంలోని రాష్ట్ర కార్యవర్గం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ప్రభుత్వంతో నిరంతర చర్చలు, సమన్వయం, అలుపెరగని పోరాటాల ఫలితంగానే నేడు ఈ చారిత్రాత్మక విజయాలు సాధ్యపడ్డాయని జిల్లా నేతలు తెలిపారు.

**ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు**

ఉద్యోగులు, ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్ల పట్ల




సానుకూలంగా స్పందించి, ఈ చారిత్రాత్మక నిర్ణయాలకు ఆమోదం తెలిపిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి ఏపీ జేఏసీ ప్రకాశం జిల్లా పక్షాన ఏపీయన్‌జిఓ ప్రకాశం జిల్లా చైర్మన్, ఏపీ యన్‌జిఓ అసోసియేషన్ ప్రకాశం జిల్లా అధ్యక్షులు కె శరత్ బాబు, ఏపీయన్‌జిఓ అసోసియేషన్ ప్రకాశం జిల్లా కార్యదర్శి ఆర్‌సి హెచ్ కృష్ణారెడ్డిలు, హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే ఈ విజయం సాధించిన జేఏసీ, ఏపీయన్‌జిఓ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులందరికీ ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఉద్యోగుల సంక్షేమమే మా లక్ష్యం. ఉద్యోగుల హక్కుల సాధనే మా ధ్యేయం అని వారు ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.

ఈ సందర్భంగా జిల్లా కోశాధికారి కె శివ కుమార్, మహిళా విభాగం రాష్ట్ర కన్వీనర్ పి మాధవి, ఉపాధ్యక్షులు బి ఏడుకొండలు, తోట శ్రీనివాసు, పి రామాంజనేయులు , అర్ దీపక్ కుమార్, బి విజయ్ కుమార్, కె కోటేశ్వరమ్మ, జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శి బి కృష్ణ కిషోర్, జిల్లా సంయుక్త కార్యదర్శులు యం శ్రీనివాసరావు (వాసు), డి వెంకటేశ్వర్లు, డి మధుసూదనరెడ్డి, కె రాజేష్‌బాబు, వి హరిబాబు, ఒంగోలు పట్టణ అధ్యక్షులు కొత్తపల్లి మంజేష్, కార్యదర్శి షేక్ మగ్దుం షరీఫ్, మహిళా విభాగం జిల్లా కన్వీనర్ సిహెచ్ శిరీష, తదితరులు హర్షం వ్యక్త పరిచారు.

# సీఎం సహాయనిధి పంపిణీ చేసిన యువనేత కందుల విఘ్నేష్‌రెడ్డి




(షణ్ముఖ వెలుగు, కొనకనమిట్ల, జూన్ 23)
మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి కుమారుడు, యువనేత విఘ్నేష్‌రెడ్డి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 16 మందికి సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. లబ్ధిదారుల నివాస గృహాలకు వెళ్ళి స్వయంగా వారిని కలిసి మాట్లాడి వారితో యోగాక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. సీఎం సహాయనిధి చెక్కుల పొందిన వారిలో చిట్యాల పెద్ద వెంకట నరసయ్య (కొనకనమిట్ల)కి రూ.50,920, నిశనం రూతు (కొనకనమిట్ల) కి రూ.78,300, కడెం బాలమ్మ (మునగపాడు)కి రూ.40,895 , తాతిరెడ్డి పెద్ద వెంకటరెడ్డి (నాగంపల్లి) కి రూ.6,59,837, శీలం శ్రీనివాసరెడ్డి (నాగరాజుకుంట) కి రూ.1,30,117, కామసాని బాల వెంకట సుబ్బారెడ్డి (నాగరాజుకుంట) కి రూ.94,390, బోనం వెంకటేశ్వరరెడ్డి (పాతపాడు) కి రూ.42,584, కదమ వీర బ్రహ్మం (వాగుమడుగు) కి రూ.78,096, కదమ రాజేశ్వరి (వాగుమడుగు) కి రూ.1,22,226, పంది చిన్న వెలుగొండ (కాట్రగుంట) కి రూ.23,400, తోట నరేంద్ర (కాట్రగుంట) కి రూ.15,000, కందుల సరిత (కాట్రగుంట)కి రూ.4,00,000, బొడ్డపాటి నవీన అనూష (పెదరికట్ల) కి రూ.24,001, జగన్నాథ వెంకటస్వామి (పుట్లూరి వారిపల్లి) కి రూ.43,727, దూల్ల భూలక్ష్మి (రేగుమానుపల్లె) కి రూ.20,000, ఎద్దుల జ్యోతి (స్టేషన్ పల్లి) కి రూ.23,800, వెరసి మొత్తంగా రూ.18, 47, 293 ల చెక్కులను అందించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మూరబోయిన బాబురావు యాదవ్, మాజీ మండల పార్టీ అధ్యక్షులు తాతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, పొదిలి పట్టణ తెలుగు యువత అధ్యక్షులు షేక్ కాలేషా, టీడీపీ నాయకులు దుగ్గెంపూడి శ్రీనివాసరెడ్డి (హనీమూన్), గొంట్ల రవికుమార్, ఇతర నాయకులు, ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.















On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com